- aruhi group
www.mahaaprabha.com

# నమస్తే మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

మంగళవారం
28-04-2026

సంపుటి : 01 సంచిక :37 పేజీలు : 08 వెల : ₹5/- తెలంగాణ , ఆంధ్రప్రదేశ్.

Published From RANGAREDDY TELANGANA.RNI NO : TGTEL/26/A0738 VOLUME 01 ISSUE 37 NAMASTEY MAHAAPRABHA



Mr.NAKKA RAJU
Chairman of Mahaaprabha

## పెట్రోల్.. నో స్టాక్

### తెలంగాణ బంకుల్లో నో స్టాక్ బోర్డులు

- తెరిచిన బంకుల్లో భారీగా క్యూలు
- లీటర్ పెట్రోల్ కోసం గంటల పాటు నిరీక్షణ
- ఏపీలో ఆయిల్ కొరతతో తెలంగాణకు వాహనాలు క్యూ
- పెట్రోల్, డీజిల్ కొరత లేదంటున్న సివిల్ సప్లయిస్ కమిషనర్




హైదరాబాద్, ఏప్రిల్ 27(మహా ప్రభ) మిడిల్ ఈస్ట్‌లో టెన్షన్స్ కారణంగా క్రూడ్ ఆయిల్ కొరత కారణంగా దేశ వ్యాప్తంగా ఇంధన సమస్యలు తలెత్తిన విషయం తెలిసిందే. తెలంగాణ రాష్ట్రంలో మరోసారి పెట్రోల్ కొరత భయాలు పెరుగుతున్నాయి. పెట్రోల్ బంకుల్లో డీజిల్ కొరత.. "నో స్టాక్" బోర్డులు దర్శనమిస్తుండడం తో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కిలోమీటర్ల మేర బారులు రాష్ట్రంలో మరోసారి ఇంధన కొరత వినియోగదారులను ఇబ్బందులపాలు చేస్తోంది. నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని పౌరసరఫరాల శాఖ స్పష్టత ఇచ్చినా రాష్ట్ర రాజధాని హైదరాబాద్ సహా పలు జిల్లాల్లో పెట్రోల్ బంకుల్లో మాత్రం నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి.

-మిగతా 3 లో

## రాష్ట్రంలో కాంగ్రెస్ అరాచక పాలన

### తీవ్ర సంక్షోభంలో రాష్ట్ర వ్యవసాయ రంగం



- రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు అధ్వాన్నం
- పంట కొనుగోళ్ల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి
- ప్రజా సమస్యలపై ఇక నుంచి ఉధృతంగా పోరాటం
- మీడియా సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్ ఏప్రిల్ 27(మహా ప్రభ)

రాష్ట్రంలో కాంగ్రెస్ అరాచక పాలన కొనసాగిస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. వీటిపై రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో చర్చించామని తెలిపారు. ప్రతి ప్రజా సమస్యను ఐడెంటిఫై చేస్తామని పేర్కొన్నారు. త్వరలోనే కేసీఆర్ అధ్యక్షతన మరో సమావేశం ఉంటుందని వెల్లడించారు. ప్రజా సమస్యలపై ఇక నుంచి ఉధృతంగా పోరాడాలని నిర్ణయించుకున్నామని చెప్పారు.కేసీఆర్ అధ్యక్షతన తెలంగాణ భవన్‌లో జరిగిన రాష్ట్ర కార్యకవర్గ సమావేశంలో కీలక తీర్మానాలు

-మిగతా 3 లో



## మే 4 తర్వాత ప్రమాణస్వీకారానికి మళ్ళీ వస్తా'

- బెంగాల్‌లో బీజేపీ విజయంపై మోదీ ధీమా!
- బారక్‌పూర్‌లో మోదీ ఎన్నికల ప్రచారం
- బెంగాల్‌తో తనది ఆధ్యాత్మిక అనుబంధమని వెల్లడి

కోల్‌కతా ఏప్రిల్ 27(మహా ప్రభ)

బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుపుపై ప్రధాని నరేంద్ర మోదీ ధీమా వ్యక్తం చేశారు. తాను మే 4 తర్వాత బీజేపీ ప్రభుత్వ ప్రమాణ స్వీకార మహోత్సవంలో పాల్గొనేందుకు మళ్లీ రాష్ట్రానికి వస్తానని ఆయన అన్నారు. బెంగాల్ రెండో దశ ఎన్నికల పోలింగ్‌కు ముందు బారక్‌పూర్‌లో నిర్వహించిన విజయ సంకల్ప ర్యాలీలో మాట్లాడుతూ ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆ రాష్ట్రంతో తనకున్న సుదీర్ఘ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. 'బెంగాల్‌తో నాకున్న అనుబంధం ఒక శక్తి ఆరాధన లాంటిది. అది నా వ్యక్తిగత ఆధ్యాత్మిక ప్రయాణానికి శక్తి కేంద్రంగా నిలిచింది. బెంగాల్‌కు చెందిన గొప్ప వ్యక్తులు, ప్రజల అపార ప్రేమ నాకు స్ఫూర్తి. ఈ గడ్డపై నేను పొందిన అనుభవాలను నాకు లభించిన గొప్ప ఆశీర్వాదంగా భావిస్తున్నాను"

-మిగతా 3 లో

## ప్రచారం..పరిసమాప్తం

### పశ్చిమ బెంగాల్‌లో మూగబోయిన మైకులు

- మలి విడతలో 142 స్థానాలకు ఎన్నికలు
- ఈ నెల 29న తేదీన పోలింగ్
- తృణమూల్, బీజేపీ మధ్య హోరాహోరీ పోరు
- ప్రచారంలో మమతా, అమిత్ షా, మోదీ
- మే 4వ తేదీన ఓట్ల లెక్కింపు



కోల్‌కతా, ఏప్రిల్ 27(మహా ప్రభ)

పశ్చిమ బెంగాల్‌లో సోమవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం ముగిసింది. రాష్ట్రంలో రెండు విడతలుగా పోలింగ్ జరుగుతోంది. తొలి విడత ఓటింగ్ ఏప్రిల్ 23న ముగిసింది. మునుపెన్నడూ లేని విధంగా రికార్డ్ స్థాయిలో పోలింగ్ నమోదైంది. దాదాపు 152 నియోజకవర్గాల్లో 93 శాతం ఓటింగ్ నమోదైంది. గత రికార్డులన్నీ బద్దలు కొట్టింది. ఇక మలి విడత

-మిగతా 3 లో



## పటిష్టంగా.. రక్షణ వ్యవస్థ

### భారత్ భారీగా ఆయుధాల దిగుమతి

- ఆయుధాల కొనుగోళ్లలో ప్రపంచంలోనే ఇండియాది రెండో స్థానం
- అత్యాధునిక ఆయుధ సంపత్తి కోసం రూ. లక్షల కోట్ల ఖర్చు
- ఆయుధ దిగుమతుల్లో మన వాటా 8.2%

న్యూఢిల్లీ,ఏప్రిల్ 27(మహా ప్రభ)

జాతీయ రక్షణ రంగంలో 'ఆత్మనిర్భర్ భారత్' నినాదంతో మనం స్వదేశీ తయారీకి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నప్పటికీ, స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎస్ఐపీఆర్ఐ) వెల్లడించిన గణాంకాలు చేదు నిజాన్ని వెల్లడిస్తున్నాయి. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం కారణంగా యుద్ధ సామగ్రి దిగుమతుల్లో ఉక్రెయిన్ అగ్రస్థానంలో ఉండగా, శాంతి సమయాల్లోనూ భారత్ ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ఆయుధ దిగుమతిదారుగా నిలవడం గమనార్హం.

ఆయుధ దిగుమతుల్లో మన వాటా 8.2%

అంతర్జాతీయ ఆయుధ మార్కెట్లో భారతదేశం తన ఉనికిని చాటుతోంది. సిప్రీ నివేదిక ప్రకారం..

-మిగతా 3 లో

## రాష్ట్రంలో దైన్యంగా రైతుల పరిస్థితి

- ధాన్యం కోనే దిక్కుల లేకుండా పోయింది
- బీజేపీ ఎంపి తేజస్వీ సూర్య వ్యాఖ్యలు దుర్మార్గం
- ఒక్కరు కూడా ఎదిరించి మాట్లాడలేక పోయారు
- బీఆర్ఎస్ ఎంపిలు ఉంటే రణరంగం సృష్టించేవారు
- తెలంగాణ భవన్‌లో బిఆర్ఎస్ అధినేత కేసీఆర్



హైదరాబాద్, ఏప్రిల్ 27(మహా ప్రభ)

రాష్ట్రంలో రైతుల పరిస్థితి దిగజారిపోయిందని మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. ప్రభుత్వానికి ధాన్యం కొనడం చేత కావట్లేదని విమర్శించారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం తెలంగాణ భవన్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఏం జరుగుతోందో అర్థం కావడం లేదు. తెలంగాణ గురించి ఎంపీ తేజస్వి సూర్య ఇష్టం వచ్చినట్లు మాట్లాడారు. ఆయన వ్యాఖ్యలపై కాంగ్రెస్, భాజపా ఎంపీలు ఒక్కమాట మాట్లాడలేదు. బీఆర్ఎస్ ఎంపీలు లోక్‌సభలో ఉండి ఉంటే రణరంగం సృష్టించేవాళ్లు.

-మిగతా 3 లో

## మహిళల భద్రతకు ప్రభుత్వం పెద్దపీట

### మహిళలు, చిన్నారుల రక్షణకు ప్రాధాన్యం


- మహిళలను అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలిపాం
- మహిళాభివృద్ధికి తెలంగాణ బ్రాండ్ కావాలి
- గంజాయి, డ్రగ్స్ పై ఉక్కుపాదం మోపుతున్నాం
- మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఉచిత బస్సు
- అన్నిరంగాల్లో మహిళా రిజర్వేషన్ల కాంగ్రెస్ ఘనతే
- స్పందన బృందాల ప్రారంభోత్సవంలో సిఎం రేవంత్

హైదరాబాద్, ఏప్రిల్ 27(మహా ప్రభ)

అభివృద్ధి చెందిన దేశాల్లో మహిళలు, చిన్నారులకు రక్షణ మొదటి ప్రాముఖ్యతగా ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఏ దేశంలో, నగరంలో వీరికి రక్షణ ఉంటుందో.. అక్కడ అభివృద్ధి ఎక్కువగా జరుగుతుందన్నారు. మహిళలు, చిన్నారుల భద్రత కోసం హైదరాబాద్ పోలీసులు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. మహిళా భద్రతా విభాగం ఆధ్వర్యంలో స్పందన బృందాలను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించి మాట్లాడారు.

-మిగతా 3 లో





## కోర్టుపై తనకు నమ్మకం పోయింది

- అందుకే మీరు ఉన్నంత వరకు హాజరు కాను
- ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిపై కేజ్రీవాల్ వ్యాఖ్యలు
- ఈ మేరకు లేఖ విడుదలచేసిన కేజ్రీవాల్


న్యూఢిల్లీ, ఏప్రిల్ 27(మహా ప్రభ)

ఢిల్లీ మద్యం విధానం కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజీవ్రాల్ అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. ఈ కేసును విచారిస్తున్న ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ స్వర్ణకాంత శర్మ ఎదుట హాజరుకావడానికి ఆయన నిరాకరించారు. ఈ మేరకు ఆయన న్యాయమూర్తికి ఒక లేఖ రాస్తూ, కోర్టుపై తనకు 'నమ్మకం పోయిందని' సంచలన వ్యాఖ్యలు చేశారు. తన అంతరాత్మ ప్రభోదం మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేజీవ్రాల్ వెల్లడించారు. 'న్యాయం జరుగుతుందన్న ఆశలు ఆవిరయ్యాయి. అందుకే మహాత్మా గాంధీ చూపిన సత్యాగ్రహ మార్గంలో నడవాలని నిర్ణయించుకున్నాను. వ్యక్తిగతంగా గానీ, కనీసం నా తరపు న్యాయవాది ద్వారా గానీ విచారణకు హాజరుకాను' అని ఆయన లేఖలో పేర్కొన్నారు. అయితే, చట్టపరంగా తనకు ఉన్న హక్కుల ప్రకారం ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టును ఆశ్రయిస్తానని ఆయన

-మిగతా 3 లో

## నేను రేపిస్టును కాను..

- డిన్నర్ షూటర్ మ్యానిఫెస్టోపై ట్రంప్ ఆగ్రహం



3 లో

## ఇష్టం లేకుంటే.. విడిపోవచ్చు

### సహజీవనం నేరం కాదంటూ సుప్రీం కోర్టు సంచలన తీర్పు



- కలిసి ఉండి.. ఆ తర్వాత లైంగిక దాడంటూ కేసులా..
- ఈ పద్ధతి మంచిది కాదన్న జస్టిస్ నాగరత్నం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 27(మహా ప్రభ)

సహజీవనం విషయంలో సుప్రీం కోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. ఇష్టం లేనప్పుడు సహజీవన భాగస్వామి నుంచి విడిపోవడం నేరం కాదని స్పష్టం చేసింది. పెళ్లి పేరుతో నమ్మించి తనపై అత్యాచారానికి పాల్పడ్డాడంటూ ఓ మహిళ దాఖలు చేసిన పిటిషన్‌ను

-మిగతా 3 లో

## ఢిల్లీ కోటలో ఆర్సీబీ జెండా

### 6.3 ఓవర్లలోనే టార్గెట్‌ను ఊదేసిన బెంగళూరు



3 లో

# బీజేపీలో ఆప్ ఎంపీల విలీనానికి గ్రీన్ సిగ్నల్..


### రాజ్యసభ చైర్మన్ ఆమోదం



**న్యూఢిల్లీ ఏప్రిల్ 27(మహా ప్రభ)**
రాజ్యసభలో బీజేపీలో ఏడుగురు ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఎంపీల విలీనానికి రాజ్యసభ చైర్మన్ రాధాకృష్ణన్ సోమవారం అధికారికంగా ఆమోదం తెలిపారు. దీంతో రాజ్యసభలో బీజేపీ బలం 113కు చేరగా, ఆప్ బలం మూడుకు పడిపోయింది. రాఘవ్ చద్దా, హర్భజన్ సింగ్, స్వాతి మాలీవాల్ సహ ఏడుగురు ఆప్ ఎంపీలు ఒకేసారి బీజేపీలోకి ఫిరాయించిన విషయం తెలిసిందే. వారంతా ప్రస్తుతం బీజేపీలో విలీనమయ్యారు.విలీనం తర్వాత తమను బీజేపీ ఎంపీలుగానే పరిగణించాలని కోరుతూ ఈ ఏడుగురు ఎంపీలు రాజ్యసభ చైర్మన్‌కు వినతిపత్రం సమర్పించగా, తాజాగా దానిని ఆయన ఆమోదించారు. రాజ్యసభ అధికారిక వెబ్‌సైట్ ప్రకారం, ఈ ఏడుగురు ఎంపీలు ఇప్పుడు బీజేపీ సభ్యుల జాబితాలో ఉన్నారు. ఈ ఏడుగురు ఎంపీల సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరుతూ ఆప్ ఆదివారం రాజ్యసభ చైర్మన్‌కు వినతిపత్రం సమర్పించింది.

# భార్యను చంపి.. చెక్కపెట్టెలో పెట్టి సిమెంట్‌తో సీలింగ్!..

### గుజరాత్‌లో దారుణం



**సూరత్ ఏప్రిల్ 27(మహా ప్రభ)**
గుజరాత్‌లోని సూరత్‌లో దిగ్భ్రాంతికర హత్య వెలుగు చూసింది. ఓ డైటీషియన్‌ను ఆమె భర్త చంపినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. పరారీలో ఉన్న విశాల్ సాల్వి(40) నాలుగు రోజుల క్రితం తన భార్య శిల్ప సాల్వి(39) కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే విశాల్ ఇంట్లో అతడు రాసిన ఒక నోట్ పోలీసులకు అనుమానం తెప్పించింది.తానొక ఘోరమైన తప్పు చేశానని.. శిల్ప బతికి లేదని అతడు ఒప్పుకొన్నట్టు అందులో ఉన్నది. దీంతో పోలీసులు నిందితుడికి చెందిన ఓ పాత ఇంట్లో సోదాలు నిర్వహించగా... అక్కడ చెక్కపెట్టెలో సిమెంట్ సీలింగ్ చేసిన శిల్ప శవం కనిపించింది. పోలీసులు ఆధారాలను ఫోరెన్సిక్ పరీక్షకు పంపారు. శిల్పకు వివాహేతర సంబంధం ఉన్నదన్న అనుమానంతోనే ఆమెను విశాల్ హత్య చేసి ఉండొచ్చని అనుమానిస్తున్నారు.

# 50 డిగ్రీల వేడిలోనూ చల్లదనాన్ని పంచే ఏసీ

### ఐఐటీ-ఢిల్లీ సహకారంతో భారతీయ స్టార్టప్ తయారీ




**న్యూఢిల్లీ, ఏప్రిల్ 27(మహా ప్రభ)**
ఐఐటీ-ఢిల్లీ సహకారంతో భారతీయ స్టార్టప్ 'ఆప్టిమిస్ట్' తీవ్రమైన వాతావరణ పరిస్థితుల్లోనూ సమర్థంగా పనిచేయగల 'ఎయిర్‌కండిషనింగ్' వ్యవస్థను అభివృద్ధి చేసింది. 50 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతల్లోనూ సమర్థంగా పనిచేయగల అత్యాధునిక 'ఏసీ'ని తయారుచేసింది. ఐఐటీ-ఢిల్లీ, పరిశ్రమ వర్గాల భాగస్వామ్యంతో 18 నెలలపాటు సాగిన పరిశోధనల ఫలితంగా దీనిని సాధించినట్టు స్టార్టప్ కంపెనీ పేర్కొన్నది.ఎయిర్ కండిషనింగ్ వ్యవస్థ పైలట్ దశ పరీక్షలను విజయవంతంగా పూర్తిచేసినట్టు తెలిపింది. త్వరలో దీనిని మార్కెట్‌లోకి తీసుకొచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్టు పేర్కొన్నది. 2024లో ఆశీష్ గోయల్, ప్రణవ్ చోప్రా స్థాపించిన 'ఆప్టిమిస్ట్', ఇటీవల తన తయారీని విస్తరించడానికి, ఆర్ అండ్ డీని బలోపేతం చేయడానికి 12 మిలియన్ డాలర్లను సమీకరించింది.

# 90 లక్షల ఓట్లను తొలగించినందుకు బెంగాల్ ప్రజలు ప్రతీకారం తీర్చుకుంటారు



**కోల్‌కతా ఏప్రిల్ 27(మహా ప్రభ)**
బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి ఆమ్‌ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ క్రేజీవాల్ మద్దతుగా నిలిచారు. ఎస్‌ఐఆర్ ప్రక్రియ ద్వారా తమ ఓట్లను తొలగించిన 90 లక్షల మంది ఓటర్లు ఈ ఎన్నికల్లో బిజెపిపై ప్రతీకారం తీర్చుకుంటారు అని ఆయన అన్నారు. సోమవారం ఆయన కలకత్తాలో ఎన్నికల ప్రచారంలో భాగంగా బహిరంగ సభలో మాట్లాడుతూ.. 'ఈ ఎన్నికల సందర్భంగా మమతా బెనర్జీకి నా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. బిజెపి నియంతృత్వానికి వ్యతిరేకంగా పశ్చిమ బెంగాల్ ప్రజలు పోరాడుతున్న తీరుకు నేను అభినందనలు తెలియజేస్తున్నాను. గత రెండు రోజులుగా రాష్ట్రంలో నేను చూసిన వాతావరణాన్ని బట్టి, రాష్ట్రంలో 90 లక్షల ఓట్ల కోతకు బెంగాల్ ప్రజలు ప్రతీకారం తీర్చుకుంటారని అనిపిస్తోంది' అని అన్నారు.

# కేదార్‌నాథ్.. 144 ఏళ్ల క్రితం ఇలా.

### - ఫోటో షేర్ చేసిన ఆనంద్ మహేంద్ర



**డెహ్రాడూన్:ఏప్రిల్ 27(మహా ప్రభ)**
వ్యాపారవేత్త ఆనంద్ మహేంద్ర తన ఎక్స్‌లో ఓ కొత్త ఫోటో పోస్టు చేశారు. కేదారీశ్వరుడి ఆలయానికి చెందిన ఫోటోను ఆయన తన ట్విట్టర్‌లో షేర్ చేశారు. అయితే 144 ఏళ్ల క్రితం .. హిమాలయాల ఒడిలో ఉన్న పరమశివుడి క్షేత్రంగా వర్ణిస్తూ ఆయన ఓ ఫోటో పెట్టారు. ఛార్‌ధామ్ యాత్రలో భాగమైన జ్యోతిర్లింగ క్షేత్రం కేదార్‌నాథ్ ఇప్పుడు విశేష సంఖ్యలో భక్తులను ఆకర్షిస్తున్నది. అయితే ఆ ఆలయానికి చెందిన ఓ అరుదైన ఫోటోను ఆనంద్ మహేంద్ర తన ఎక్స్‌లో పెట్టారు. 1882లో ఆ ఫోటోను తీసినట్లు ఆయన పేర్కొన్నారు. పవిత్రమైన కేదార్‌నాథ్ ధామ్ ఫోటో ఇది అన్నారు. ఆ ఫోటో నుంచి తన కండ్లను తిప్పలేకపోతున్నట్లు చెప్పారు. ఆ రోజుల్లో రోడ్లు లేవు, రైలుమార్గాలు లేవు, హెలికాప్టర్లు లేవు అని పోస్టులో ఆయన రాశారు. ఆ రోజుల్లో యాత్ర చేపట్టాలంటే ఓ సాహసమే. సమయం, శక్తి, నమ్మకం అన్నీ ముఖ్యం. అదేమీ ఆషామాషీగా చేపట్టే యాత్ర కాదు అని, అదే నిజమైన యాత్ర అన్న అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేశారు. ప్రస్తుతం కేదార్‌నాథ్‌కు వెళ్లడం చాలా సులువైందన్నారు. ఇదొరకంగా మంచి పరిణామమే అని, దీని వల్ల అందరూ ఆ దైవాన్ని చేరుకునే అవకాశం వస్తుందన్నారు. కానీ పరిరక్షించాల్సిన విషయాలు చాలా ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. ట్రావలింగ్ అనుభవం ముఖ్యమైందని, దాన్ని ఎంజాయ్ చేయాలని ఆయన తెలిపారు. ఆ జర్నీలే మనల్ని మన మార్గం వైపు మళ్లిస్తాయన్నారు. ఉత్తరాఖండ్‌లోని రుద్రప్రయాగ్ జిల్లాలో కేదార్‌నాథ్ ఆలయం ఉన్నది. సుమారు 3584 మీటర్ల ఎత్తులో కేదారీశ్వరుడు కొలువై ఉన్నాడు. భారతీయులు పరమపవిత్రంగా భావించే జ్యోతిర్లింగ క్షేత్రాల్లో ఇది ఒకటి. కేవలం ఆరు నెలలు మాత్రం ఆలయాన్ని తెరిచి ఉంచుతారు. ఇక్కడ వాతావరణ పరిస్థితులు తీవ్రంగా ఉండడం వల్ల.. చలికాలంలో ఆలయాన్ని పూర్తిగా మూసివేస్తారు. ఇక ఈ ఏడాది కేదార్‌నాథ్‌కు భక్తుల తాకిడి మరీ అధికంగా ఉన్నది. ఆలయాన్ని ఓపెన్ చేసిన తొలి మూడు రోజుల్లోనే కేదారీశ్వరుడిని దర్శించుకున్నవారి సంఖ్య లక్షకుపైగా నమోదు అయ్యింది.

# ట్రంప్‌కు 'మిడిల్ ఫింగర్' చూపించిన కర్ణాటక మంత్రి.



**బెంగళూరు ఏప్రిల్ 27(మహా ప్రభ)**
భారతదేశాన్ని 'నరక కూపం' అని అభివర్ణించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలపై కర్ణాటక మంత్రి సంతోష్ లాడ్ స్పందించారు.ట్రంప్‌పై తీవ్రంగా మండిపడిన ఆయన 'మిడిల్ ఫింగర్' చూపించారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. సోమవారం బళ్లారి జిల్లా సందూరులో జరిగిన మీడియా సమావేశంలో కర్ణాటక కార్మిక శాఖ మంత్రి సంతోష్ లాడ్ మాట్లాడారు. భారతదేశాన్ని 'నరక కూపం' అని అభివర్ణించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఆయన (ట్రంప్) మన ప్రధానమంత్రిని అవమానించారు. అంతే కాకుండా ఇటీవలే ఆయన భారతదేశాన్ని 'నరక కూపం' అని సంబోధించారు. మిస్టర్ ట్రంప్, మీరు ఒక 'మ్యాడ్ మ్యాక్స్' (పిచ్చివాడి) లాంటివారు. మీరు అమెరికా అధ్యక్షులని నాకు తెలుసు. కానీ కేవలం ఆ హోదా ఉంది కదా అని నా దేశం గురించి మీకు నచ్చినట్లు మాట్లాడే హక్కు మీకు లేదు. నా దేశం గురించి మీరు మాట్లాడిన తీరును నేను తీవ్రంగా ఖండిస్తున్నా. నేను మీకు 'మధ్య వేలు' కూడా చూపించగలను. కానీ ఈ వేదిక సాక్షిగా మేమందరం ఏకతాటిపై నిలిచి ఒక్కటే చెబుతున్నాం. ట్రంప్ దయచేసి మీ ఇష్టం వచ్చినట్లు చేసుకోండి' అని అన్నారు.కాగా, ప్రధాని మోదీ, కేంద్ర నాయకత్వం ట్రంప్ వ్యాఖ్యలపై గట్టిగా స్పందించడంలో విఫలమయ్యారని సంతోష్ లాడ్ విమర్శించారు. వారి మౌనం సిగ్గుచేటని అన్నారు. అయితే ట్రంప్‌ను ఉద్దేశించి ఆయన 'మిడిల్ ఫింగర్' చూపిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో దీనిపై మిశ్రమ స్పందన వ్యక్తమైంది. ప్రజాప్రతినిధిగా ఆయన హోదాకు ఇది తగదని కొందరు విమర్శించారు. అయితే ట్రంప్ వ్యాఖ్యలపై భారత ప్రజాగ్రహాన్ని ఇది ప్రతిబింబిస్తోందని మరికొందరు పేర్కొన్నారు.

# మినాబ్ స్కూల్‌పై దాడి.. కేసు క్లోజ్ చేసిన ఇరాన్..


### ఏడేళ్ల చిన్నారి ఒక్కడే మిస్సింగ్




**టెహ్రాన్:ఏప్రిల్ 27(మహా ప్రభ)**
ఫిబ్రవరి 28వ తేదీన అమెరికా-ఇజ్రాయెల్ దళాలు.. ఇరాన్‌పై వైమానిక దాడి చేసిన విషయం తెలిసిందే. ఆ రోజు మినాబ్‌లోని షాజరే తయ్యిబే ఎలిమెంటరీ స్కూల్ పై బాంబు దాడి జరిగింది. ఆ ఘటనలో సుమారు 156 మంది మృతిచెందారు. ఆ మృతుల్లో 120 మంది స్కూల్ పిల్లలు ఉన్నారు. దాంట్లో 73 మంది అబ్బాయిలు, 43 మంది బాలికలు ఉన్నారు. మిగితా వారిలో టీచర్లు, సిబ్బంది ఉన్నారు. అయితే ఆ దాడిలో మృతిచెందిన చిన్నారుల్లో ఒక్కరు మాత్రం ఇంకా మిస్సింగ్‌లోనే ఉన్నారు.ఏడేళ్ల మకన్ నాసిరి అనే అబ్బాయి ఆచూకీ చిక్కలేదు. ఆ చిన్నారి మృతదేహాన్ని అధికారులు గుర్తించలేకపోయారు. కానీ ఆ పిల్లోడికి చెందిన ఓ కాలి షూ మాత్రం దొరికింది. సుమారు ఏడు వారాల పాటు ఆ పిల్లోడి ఆనవాళ్ల కోసం సెర్చింగ్ చేశారు. కానీ మకన్ ఆచూకీ చిక్కకపోవడంతో కేసును మూసివేస్తున్నట్లు ఇరానీ అధికారులు ప్రకటించారు. దాడి జరిగిన రోజున 11 గంటల సమయంలో ఆ పిల్లోడి తల్లికి ఓ టీచర్ ఫోన్ చేసింది. స్కూల్‌పై దాడి జరిగిందని, త్వరగా వచ్చి పిల్లవాడిని తీసుకెళ్లమని చెప్పారు. అయితే మకన్ తల్లి ఆ స్కూల్‌కు వెళ్లేలోపే అక్కడ విధ్వంసం చోటుచేసుకున్నది. దాడితో స్కూల్ మొత్తం చెల్లాచెదురైంది. శిథిలాలే మిగిలి ఉన్నాయి. స్కూల్ బస్సు డ్రైవర్ ప్రయత్నించినా పిల్లోడి ఆచూకీ చిక్కలేదు. ఇక ఆ ప్రాంతంపై రెండో మిస్సైల్ అటాక్ జరిగిన తర్వాత అక్కడ రెస్క్యూ మరింత జఠిలమైంది. స్కూల్ దాడిలో చనిపోయిన చిన్నారులకు చెందిన అవశేషాలను ఫోరెన్సిక్ నిపుణులు ఐడెంటిఫై చేశారు. కానీ మకన్ ఆనవాళ్లను మాత్రం ట్రేస్ చేయలేకపోయారు. డీఎన్ఏ టెస్టింగ్ తర్వాత కూడా ఆ పిల్లవాడి మృతదేహాన్ని గుర్తించలేదు. యుద్ధంలో మృతిచెందిన వారిలో 40 శాతం మృతదేహాలను గుర్తించడం కష్టంగా ఉందని ఇరాన్ ఫోరెన్సిక్ నిపుణుడొకరు తెలిపారు. అమెరికా-ఇజ్రాయెల్ దళాలు చేసిన దాడిలో ఇప్పటి వరకు ఇరాన్‌లో 3375 మంది మరణించారు. మినాబ్‌పై జరిగిన దాడిలో అమెరికా తోమాహాక్ క్షిపణి వాడినట్లు అనుమానిస్తున్నారు.

# పట్టాలు తప్పిన వందే భారత్ రైలు..

### -పుణెలో ఘటన



**పుణె ఏప్రిల్ 27(మహా ప్రభ)**
ముంబై-సోలాపూర్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలు తప్పింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని రైల్వే అధికారులు తెలిపారు. సోమవారం సాయంత్రం పుణె రైల్వే స్టేషన్‌కు సమీపిస్తున్న క్రమంలో రైల్‌లోని ఒక బోగీ పట్టాలు తప్పింది. రాత్రి 7.30 గంటల సమయంలో ఈ రైలు ముంబై ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినస్ నుంచి సోలాపూర్‌కు వెళుతుండగా ఈ దుర్ఘటన జరిగింది. 'వందే భారత్ రైలులోని బోగీ వీల్స్‌లో ఒకటి డైమండ్ క్రాసింగ్ వద్ద పట్టాలు తప్పింది.ఈ క్రాసింగ్‌ను యుద్ధ ప్రాతిపదికను మారుస్తున్నారు. ప్రమాదంలో ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదు' అని ఓ అధికారి తెలిపారు. ప్రమాదానికి గురైన కోచ్‌లోని ప్రయాణికులు తమ సామగ్రి తీసుకొని సమీపంలోని ప్లాట్‌ఫామ్ వైపునకు నడుచుకుంటూ వెళ్లిపోయారు. డైమండ్ క్రాసింగ్ అనేది ఒక రైల్వే జంక్షన్. ఇక్కడ రెండు ట్రాక్‌లు ఒకేస్థాయిలో ఒకదానికొకటి ఖండించుకుంటూ వజ్రాకారంలో ఏర్పడుతాయి.

# బిర్యానీ, పుచ్చకాయ తిని.. ఒకే కుటుంబంలో నలుగురు మృతి!



**ముంబై, ఏప్రిల్ 27(మహా ప్రభ)**
రాత్రి భోజనంలో బిర్యానీ, పుచ్చకాయ తిన్న తర్వాత ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వ్యక్తులు తీవ్ర అస్వస్థతకు గురై ప్రాణాలు కోల్పోయారు. ముంబై పైధోనియా ప్రాంతంలో చోటుచేసుకున్న ఈ ఘటన మహారాష్ట్రలో సంచలనం రేపింది. ఈ ఘటనలో 40 ఏండ్ల వ్యక్తి, ఆయన భార్య (35), వారి ఇద్దరు పిల్లలు మృతి చెందటం అందర్నీ షాక్‌కు గురిచేసింది. ఫుడ్ పాయిజనింగ్‌తోనే వారు చనిపోయినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు.పోలీసుల వివరాల ప్రకారం, ఏప్రిల్ 25న రాత్రి ఏర్పాటుచేసిన విందులో 9 మందితో కూడిన ఒక కుటుంబం, మరికొంత మంది దగ్గరి బంధువులు పాల్గొని భోజనం చేశారు. ఇంటికి వస్తూ నలుగురు వ్యక్తులు రాత్రి 1 గంటకు పుచ్చకాయ తిన్నారు. తెల్లవారుజామున వీరందరికీ వాంతులు, విరేచనాలు కావడంతో జేజే దవాఖానలో చేరారు. అయితే కాసేపటికే వారు మృతిచెందారు.

## ప్రచారం..పరిసమాప్తం

మొదటి తరువాయి

పోలింగ్‌లో భాగంగా మిగతా 142 నియోజకవర్గాల్లో బుధవారం జరగనుంది. ఈ నేపథ్యంలో సాయంత్రంతో ఎన్నికల ప్రచారం ముగియనుంది. ఈ నెల 29వ తేదీన పోలింగ్ జరగనుంది. ప్రస్తుతం తృణమూల్ కాంగ్రెస్–బీజేపీ మధ్య హోరాహోరీగా ప్రచారం జరుగుతోంది. రెండు పార్టీలు కూడా నువ్వా–నేనా? అన్నట్లుగా ఫైటింగ్ చేస్తున్నాయి. అయితే సాయంత్రంతో ప్రచారం ముగియడంతో సమయం తక్కువగా ఉండగా ప్రధాన పార్టీలన్నీ ప్రచారాన్ని ఉధృతం చేశాయి. చివరి సారిగా ఓటర్లను మచ్చిక చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. మొత్తం దేశం వ్యాప్తంగా ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. ఇప్పటికే తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి, అస్సాంలో ఎన్నికలు ముగిశాయి. బుధవారంతో పశ్చిమ బెంగాల్‌లో కూడా ఎన్నికలు ముగియనున్నాయి. ఎన్నికల ఫలితాలు మాత్రం మే 4న విడుదల కానున్నాయి.


## పటిష్టంగా.. రక్షణ వ్యవస్థ

మొదటి తరువాయి

ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న మొత్తం ఆయుధ దిగుమతుల్లో భారత్ వాటా 8.2 శాతంగా ఉంది. 9.7 శాతంతో ఉక్రెయిన్ మొదటి స్థానంలో ఉంది. అయితే, ఉక్రెయిన్ ప్రస్తుతం తీవ్రమైన యుద్ధంలో ఉంది కాబట్టి ఆ స్థాయిలో దిగుమతులు చేసుకోవడం సహజం. కానీ, భారత్ ఎటువంటి ప్రత్యక్ష యుద్ధంలో లేనప్పటికీ సౌదీ అరేబియా (6.8%), ఖతార్ (6.4%) వంటి సంపన్న అరబ్ దేశాలను మించి ఆయుధాలను కొనుగోలు చేస్తోంది. పాకిస్థాన్ (4.2%), జపాన్ (3.9%) వంటి దేశాలు మనకంటే వెనుకబడి ఉన్నాయి.

## నేను రేపిస్ట్‌ను కాను..

### డిన్నర్ షూటర్ మ్యానిఫెస్టోపై ట్రంప్ ఆగ్రహం



**వాషింగ్టన్**
వైట్‌హౌస్ కరస్పాండెంట్స్ డిన్నర్‌లో కాల్పులు జరిపిన నిందితుడి మ్యానిఫెస్టోను ఓ రిపోర్టర్ తన ముందే చదవడంతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను రేపిస్ట్‌ను కాదని సీబీఎస్ ఇంటర్వ్యూలో తెలిపారు. షూటర్ తన మ్యానిఫెస్టోలో ట్రంప్ రేపిస్ట్ అని పేర్కొన్న భాగాన్ని రిపోర్టర్ తన ముందు చదివిన తర్వాత ట్రంప్ స్పందిస్తూ.. 'నేను రేపిస్ట్‌ను కాను. నేనెవరినీ అత్యాచారం చేయలేదు' అని ట్రంప్ పేర్కొన్నారు.'నిందితుడు మిమ్మల్ని ఉద్దేశించే అలా రాశాడా' అని రిపోర్టర్ ప్రశ్నించినప్పుడు ట్రంప్ సహనం కోల్పోయారు. 'క్షమించండి.. నేను బాలలపై లైంగిక దాడి చేసేవాడిని కాదు. మీరు ఓ రోగి రాసిన చెత్తను చదివారు. నాకు అలాంటి విషయాలతో సంబంధం లేదు. నేను నిర్దోషిని' అని ట్రంప్ అన్నారు. నిందితుడి ఆరోపణలను చదివినందుకు సిగ్గుండాలని రిపోర్టర్‌పై ఆయన విరుచుకుపడ్డారు.

## కోర్టుపై తనకు నమ్మకం పోయింది

మొదటి తరువాయి

స్పష్టం చేశారు. ఇదిలా ఉంటే, సోమవారం విచారణకు కేజ్రీవాల్ గైర్హాజరు కావడంతో హైకోర్టు తదుపరి ఎలాంటి చర్యలు తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది. ఒకవైపు బెంగాల్ ఎన్నికల వేడి, మరోవైపు కేజ్రీవాల్ చుట్టూ తిరుగుతున్న ఈ న్యాయ వివాదాలు దేశ రాజకీయాల్లో వేడిని పెంచుతున్నాయి.మద్యం పాలసీ కేసులో కేజ్రీవాల్‌తో పాటు ఇతర నిందితులను ట్రయల్ కోర్టు గతంలో విడుదల చేసింది. దీనిని సవాలు చేస్తూ సీబీఐ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను జస్టిస్ స్వర్ణకాంత శర్మ విచారిస్తున్నారు. అయితే, ఈమె గతంలో కేజ్రీవాల్ అరెస్ట్‌ను సమర్థిస్తూ తీర్పునిచ్చారని, అలాగే ఆమె కుటుంబ సభ్యులకు ప్రభుత్వంతో సంబంధాలు ఉన్నాయని ఆరోపిస్తూ.. ఈ కేసు నుంచి ఆమె తప్పుకోవాలని కేజ్రీవాల్ పిటిషన్ వేశారు. గత ఏప్రిల్ 20 ఈ పిటిషన్‌ను జస్టిస్ స్వర్ణకాంత శర్మ కొట్టివేశారు. 'న్యాయమూర్తుల నిజాయతీని లిటిగెంట్లు విచారించలేరు. కేవలం ఊహల ఆధారంగా రీక్యూసల్ కోరలేరు' అని ఆమె ఘాటుగా వ్యాఖ్యానించారు. ఎన్నికల సమయంలో ఒక మాజీ ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి, స్వయంగా న్యాయమూర్తికి వ్యతిరేకంగా ఇలాంటి నిర్ణయం తీసుకోవడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. న్యాయవ్యవస్థపై కేజ్రీవాల్‌కు గౌరవం లేదని బీజేపీ విమర్శిస్తుంటే, తమ నాయకుడికి అన్యాయం జరుగుతోందని ఆప్ నేతలు ఆరోపిస్తున్నారు.

## ఇష్టం లేకుంటే.. విడిపోవచ్చు

మొదటి తరువాయి

జస్టిస్ బి.వి. నాగరత్న నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. తనకు 18 ఏళ్ల వయసున్నప్పుడు పెళ్లి చేసుకుంటానని నమ్మించాడని, అప్పటికే అతనికి నలుగురు భార్యలున్నా ఆ విషయం దాచిపెట్టాడని బాధితురాలు తెలిపారు. అయితే కోర్టు కేవలం పిటిషనర్ పెట్టిన కేసుపైనే దృష్టి పెడతామని స్పష్టం చేసింది.

**వివాహం కాకుంటే ముప్పే**

వివాహం కాకుండా కలిసి ఉండాలనుకుంటే, అలాంటి సంబంధాల్లో సహజంగానే కొన్ని ముప్పులు ఉంటాయని జస్టిస్ నాగరత్న ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఏళ్ల తరబడి ఏకాభిప్రాయంతో కలిసి ఉండి, బిడ్డను కూడా కన్న తర్వాత ఆ బంధం విచ్ఛిన్నం కాగానే అత్యాచారం వంటి క్రిమినల్ కేసులు పెట్టడం సరికాదని వ్యాఖ్యానించారు. ఆ బంధం వల్ల పుట్టిన బిడ్డ కోసం మాత్రం మహిళ పోషణ ఖర్చులను కోరవచ్చని సూచించింది. ఒకవేళ వివాహం జరిగి ఉంటే, ఆమె హక్కులు మరింత మెరుగ్గా ఉండేవని జస్టిస్ నాగరత్న అభిప్రాయపడ్డారు. ఈ వ్యవహారాన్ని మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవాలని ఇరుపక్షాలకు సూచించారు.

## రాష్ట్రంలో కాంగ్రెస్ అరాచక పాలన

మొదటి తరువాయి

చేశామని కేటీఆర్ తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న అన్నివర్గాలకు ధన్యవాదాలు తెలుపుతూ తీర్మానం చేశామని పేర్కొన్నారు. అరాచక కాంగ్రెస్ పాలనకు సంబంధించి భేటీలో నిర్ణయాలు తీసుకున్నామని చెప్పారు. తెలంగాణలో సబ్బండ వర్గాలు, సకల జనులకు ధన్యవాదాలు చెబుతూ తీర్మానం చేశామని అన్నారు. సమావేశం సందర్భంగా కీలక విషయాలను చర్చించామని తెలిపారు. కేసీఆర్ పార్టీ ఏర్పాటుకు దారి తీసిన పరిస్థితులు వివరించారని పేర్కొన్నారు. రైతుబంధు తీసుకొచ్చి రైతులను ఆదుకోవడాన్ని ఐరాస ప్రశంసించిందని చెప్పారు. వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉందని అన్నారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు సరిగ్గా జరగడం లేదని తెలిపారు. ఏ ఆంక్షలు లేకుండా మక్క, జొన్న పంటలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పంట కొనుగోళ్లు సరైన రీతిలో చేపట్టకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. పంట కొనుగోళ్లు త్వరగా చేసేలా ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావడంపై సమావేశంలో నిర్ణయం తీసుకున్నామని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును పాకిస్థాన్ విభజనతో పోలుస్తూ పార్లమెంటులో బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించామని కేటీఆర్ తెలిపారు. పార్లమెంటులో బీఆర్ఎస్ లేని లోటు స్పష్టంగా కనిపించిందని అన్నారు. తేజస్వి మాట్లాడిన సమయంలో సభలో ఒక్క బీఆర్ఎస్ ఎంపీ ఉన్నా అతనితో క్షమాపణలు చెప్పించి ఉండేవాళ్లమని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీజేపీల నిష్క్రియాపరత్వంపై సమావేశంలో నిరసన వ్యక్తమైందని చెప్పారు. బీజేపీ ఉద్దేశపూర్వకంగానే మహిళా బిల్లుకు అడ్డుపుల్ల వేసిందని కేటీఆర్ విమర్శించారు. మహిళా బిల్లుకు మద్దతుగా ఆనాడే బీఆర్ఎస్ తీర్మానాలు చేసి పంపిందని చెప్పారు. మహిళా రిజర్వేషన్లపై కార్యవర్గ సమావేశంలో తీర్మానం చేశామని తెలిపారు. సర్ పై కూడా కూలంకషంగా సమావేశంలో చర్చించామని కేటీఆర్ తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లో 95 లక్షలు, బిహార్‌లో 65 లక్షల ఓట్లు తొలగించారని పేర్కొన్నారు. త్వరలోనే తెలంగాణలో కూడా సర్ మొదలు కాబోతుందని వెల్లడించారు. సర్ విషయంలో కార్యకర్తలు జాగ్రత్తగా ఉండాలని కేసీఆర్ దిశానిర్దేశర చేశారని వివరించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో దొంగ ఓట్లు సృష్టించి గెలిచారని తెలిపారు.

## మహిళల భద్రతకు ప్రభుత్వం పెద్దపీట

మొదటి తరువాయి

తెలంగాణ ప్రభుత్వం మహిళల భద్రతకు పెద్దపీట వేసింది. గతంలో షీ టీమ్స్ ఏర్పాటు చేస్తే.. 'స్టాండ్ విత్ హర్' అని ప్రత్యేక కార్యక్రమం చేపట్టాం. ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం, హైదరాబాద్ పోలీసులు స్పందన పేరుతో మరో కార్యక్రమం తీసుకొచ్చారు. వారికి తక్షణ రక్షణ కోసం ఈ టీమ్స్ పని చేస్తాయి. మహిళలు, చిన్నారుల రక్షణ కోసం తెలంగాణ ప్రభుత్వం ముందుంది అని చెప్పేందుకే నేను ఈ కార్యక్రమానికి హాజరయ్యానని సీఎం అన్నారు. అమెరికా లాంటి దేశాల్లోనే మహిళలకు ఓటు హక్కు వచ్చేందుకు ఎన్నో ఏళ్లు పట్టింది. స్వాతంత్ర్యం రాగానే భారత్‌లో మహిళలకు నెహ్రూ సమాన హక్కు కల్పించారు. ఇప్పుడు అన్ని రంగాల్లో మహిళలు ఉన్నత స్థాయిల్లో ఉన్నారు. కానీ ఇంకా కొన్ని చోట్ల వారిపై వివక్ష ఉంది. కానీ మనదేశంలో దేశ ప్రధాని గా, లోక్ సభ స్పీకర్ గా, రాష్ట్రాల గవర్నర్లు, న్యాయమూర్తులు గా మహిళలకు కాంగ్రెస్ పార్టీ అవకాశం ఇచ్చింది.. మహిళా విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్లతో పాటు స్థానిక సంస్థల్లో కూడా మహిళలకు రిజర్వేషన్లు ఇచ్చి పరిపాలన లో కాంగ్రెస్ పార్టీ భాగస్వామ్యం చేసిందన్నారు. చట్టసభల్లో మహిళల రిజర్వేషన్ల కోసం 2013 లోనే బిల్లును కాంగ్రెస్ ఆమోదించిందని గుర్తు చేశారు. ఇప్పటికి కొన్ని విషయాల్లో మహిళలపైన వివక్ష ఉంది.. రాష్ట్రం అభివృద్ధి జరగాలంటే మహిళలకు రక్షణ కల్పించాలి, పిల్లలకు భద్రత ఇవ్వాలని మా ప్రభుత్వం భావించిందన్నారు. స్పందన ద్వారా తక్షణమే బాదిత మహిళలకు మానసిక భద్రత కల్పిస్తారు.. సమస్య వచ్చినప్పుడు నా పక్కన నిలబడుతుందన్న విశ్వాసాన్ని మా ప్రభుత్వం కల్పిస్తోంది.. తెలంగాణ రాష్ట్రంలో మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్న సందేశం ఇవ్వడం కోసం నేను ఈ కార్యక్రమంలో పాల్గొన్నాను.. సమస్య వచ్చిన తర్వాత పరిష్కరించడం కాదు.. అసలు సమస్యనే రాకుండా చూడాల్సిన సామాజిక బాధ్యత మనపైన ఉందన్నారు. మహిళల బాధలో అండగా నిలబడి ధైర్యాన్ని ఇచ్చే సామాజిక బాధ్యత అందరిపైన ఉందని, ప్రభుత్వ ప్రతి సంక్షేమ కార్యక్రమాల్లో మహిళలకు పెద్ద పీట వేస్తున్నాం అని వివరించారు. ఇందిరమ్మ ఇళ్లను మహిళలపేరుతో ఇస్తున్నాం.. మహిళకు ఆర్థిక స్వాలంభన వచ్చినప్పుడు



కుటుంబం సమాజంలో నిలబడుతుంది..మహిళా సాధికారిత ను అమలు చేయడం ముఖ్యం.. 67 లక్షల మంది స్వయం సహాయక మహిళా సంఘాలకు 60 వేల కోట్ల రూపాయల బ్యాంక్ రుణాలను అందజేశాం..
రాష్ట్రంలోని కోటీ మంది మహిళలకు సారె పేరుతో ఇందిరమ్మ చీరలు ఇచ్చాం.. 28 నెలల్లో మహిళల ఉచిత బస్సు ప్రయాణం కోసం ప్రభుత్వం 10 వేల కోట్లు ఖర్చు చేసింది.. ఉచిత బస్సు ప్రయాణాన్ని పకడ్బందీగా అమలు చేయడం వల్ల ఆడబిడ్డలకు 10 వేల కోట్లు ఆదా చేసుకున్నారు.. స్వయం సహాయక సంఘాలకు 1000 బస్సులను కొనిచ్చి ఆర్టీసీకి లీజు ఇప్పించాం.. 1000. మెగావాట్ల సోలార్ ఎనర్జీ ప్లాంట్ల ను స్వయం సహాయక మహిళలకు ఇప్పించాం.. ప్రభుత్వ ఆఫీసుల్లో ఇందిరమ్మ క్యాంటీన్లను స్వయం సహాయక మహిళలతో ఏర్పాటు చేయించాం.. అన్ని జిల్లాల్లో స్వయం సహాయక మహిళా సంఘాలకు భవనాలు ఏర్పాటు చేశామని సిఎం రేవంత్ అన్నారు. నారాయణపేటలో స్వయం సహాయక మహిళా సంఘాలతో పెట్రోల్ బంకు ఏర్పాటు చేయించాం.. 26 వేల ప్రభుత్వ పాఠశాలల నిర్వహరణను మహిళా సంఘాలకే అప్పగించాం..26 లక్షల ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల స్కూల్ యూనిఫామ్ లు కుట్టే బాధ్యతను స్వయం సహాయక మహిళలకు ఇచ్చాం..హైటెక్ సిటీ దగ్గర 1000 కోట్ల విలువ చేసే మూడున్నర ఎకరాల్లో మహిళా శక్తి స్టాల్స్ ను ఏర్పాటు చేశాం.. అమెజాన్ తో ఒప్పందం చేసుకుని ఆడబిడ్డల తయారు చేసే ఉత్పత్తులను అమ్మే విధంగా చేశాం.. 2034 నాటికి వన్ ట్రిలియన్ , 20247 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ గా చేయాలని ప్రభుత్వం లక్ష్యం గా పెట్టుకుందని,ఇది జరగాలంటే మహిళలకు భద్రత ఉండాలని సిఎం అన్నారు. సమాజం నిలబడాలంటే మహిళలు తమ కాళ్లపైన తాము నిలబడాలి.. ఎంత ఆర్థిక ప్రగతి సాధించినా పిల్లలు సరైన దారిలో నడవకపోతే అంతా వృథా.. పంజాబ్ లాంటి రాష్ట్రంలో మన కళ్ల ముందే డ్రగ్స్ వల్ల యువత నిర్వీర్యం అయింది.. వ్యసనాలబారి న పడి ఆ రాష్ట్రం కోలుకోని స్థితిలో ఉంది.. స్కూల్స్ ముందు చిన్న చిన్న దుకాణాల్లో గంజాయి అమ్ముతున్నారు.. మత్తుకు బానిసలైన వారు, గంజాయి తీసుకుంటున్న వారే ఎక్కువ మంది మహిళలు, చిన్న పిల్లలపైన అకృత్యాలకు పాల్పడుతున్నారు..
ఈగల్ ఫోర్స్ ను మా ప్రభుత్వం తీసుకువచ్చి డ్రగ్స్ పైన కఠినంగా వ్యవహారిస్తోంది.. ఎంత పెద్ద వారు ఉన్నా, సెలబ్రేటీల్స్ ఉన్నా , ప్రజా ప్రతినిధులు ఉన్నా వదలకుండా అరెస్టు చేస్తున్నాం.. ఇటీవల డ్రగ్స్ కేసులో ప్రజాప్రతినిధులను కూడా అరెస్టు చేశాం..
గంజాయి, డ్రగ్స్, మద్యం బానిసల వల్ల జరిగే క్రైమ్స్ పైన పీస్ కమిటీ సభ్యులు దృష్టి పెట్టాలి.. మతకల్లోలాలకే కాకుండా పీస్ కమిటీలను విస్తరించాలి.. పాఠశాలల్లో చేరే సమయంలో డ్రగ్స్ తీసుకోమని సెల్ఫ్ డిక్లరేషన్ ఇవ్వాలి.. డ్రగ్స్ , గంజాయి పైన మాట్లాడాల్సిన అవసరం ఇప్పుడు ఉంది..
డ్రగ్స్ పునరావాస కేంద్రాలను కూడా పెంచుతున్నాం.. బాధ్యతను నిర్వహించకపోతే సమాజానికి అన్యాయం చేసినవాళ్లం అవుతాం.. మత్తును వదిలించాల్సిన అవసరం ఉంది.. ఎంత వారున్నా, సెలబ్రేటీస్ ఉన్నా ప్రజల మధ్య శిక్షిస్తే సందేశాన్ని ఇచ్చి వాళ్లం అవుతాం.. అని అన్నారు. భయం, బాధ్యత లేనప్పుడు విచ్చలవిడితనం వస్తుంది.. దీన్ని ప్రభుత్వం సహించదు.. నేరగాళ్ల పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుంది.. ఎంత పెద్ద కుటుంబమైనా, రాజకీయ నాయకుడైనా, ఉన్నతాధికారుల కుటుంబమైనా నేను కేర్ చేయను.. డ్రగ్స్ ను నియంత్రించాల్సిందే.. తెలంగాణ రాష్ట్రం అంటే మహిళల రక్షణ కు పర్యాయ పదం గా తీర్చిదిద్దాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క, ఎంపిలు అనిల్ కుమార్ యాదవ్, వేం నరేందర్ రెడ్డి, డిజిపి శివప్రసాద్ రెడ్డి, నగర పోలీస్ కమిషనర్ సజ్జన్నార్, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో దైన్యంగా రైతుల పరిస్థితి

మొదటి తరువాయి

కాళేశ్వరంపై రాజ్యసభలో సీఆర్ పాటిల్ మాట్లాడితే సురేశ్‌రెడ్డి గట్టిగా ఖండించారు. తెలంగాణ గురించి ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే కాంగ్రెస్, భాజపా నేతలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్ర విభజన సమయంలో.. హైదరాబాద్ విషయంలో రాజీ పడాలని సోనియా గాంధీ ఎన్నో సార్లు చెప్పారు. కానీ.. నేను ఎప్పుడూ రాజీ పడలేదు..అది నా చిత్తశుద్ధి అని కేసీఆర్ అన్నారు.బీజేపీ ఎంపీ తేజస్వి సూర్యపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మండిపడ్డారు. డీలిమిటేషన్ బిల్లుపై చర్చ సందర్భంగా బ్రిటిషర్లు భారత్, పాకిస్థాన్‌ను వేరుచేసినట్టు అత్యంత చెత్త విధానంతో ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణను వేరుచేశారంటూ తేజస్వి చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సభలోనే ఉన్న కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ సహా 16మంది రాష్ట్ర ఎంపీలు ఎవరూ దానిపై కనీసం అభ్యంతరం తెలుపకుండా మౌనంగా ఉన్నారని.. అదే పార్లమెంట్‌లో మన ఎంపీలు ఉండుంటే తేజస్వి సూర్య మాట్లాడిన మాటలకు రణరంగం చేసేవాళ్లు అని పార్టీ అంతర్గత సమావేశంలో అభిప్రాయపడ్డారు.
ఈ 16 మంది కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు తెలంగాణలో పుట్టలేదా? వాళ్లకు తెలంగాణ పౌరుషం లేదా? అని ప్రశ్నించారు. ఎంపీ తేజస్వి సూర్య అనే వెధవ మాట్లాడిన మాటలను ఎందుకు ఎండగట్టలేదని నిలదీశారు. అదే ఒక్క బీఆర్ఎస్ ఎంపీ ఉన్నా పార్లమెంట్‌లో క్షమాపణ చెప్పించేటోళ్లమని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు మౌనంగా ఉండి పౌరుషంగా లేకుండా వ్యవహరించారని మండిపడ్డారు. ఒకప్పుడు తెలంగాణ రాష్ట్రాన్ని వ్యవసాయ రంగం నుంచి ఇతర అన్ని రంగాల్లో నంబర్‌వన్‌గా నిలబెట్టామని కేసీఆర్ తెలిపారు. కానీ ఈ ప్రభుత్వం భూముల కబ్జాల్లో నంబర్‌వన్, కూలగొట్టడంలో నంబర్‌వన్‌గా నిలబట్టే ప్రయత్నం చేస్తుందని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయలేని స్థితిలో చేతకానితనంతో ఉన్నదని మండిపడ్డారు. ధాన్యం కొనుగోళ్లు లేకపోవడం వల్ల రైతన్నలు పడుతున్న ఇబ్బందులు చూస్తుంటే తీవ్రంగా బాధ అవుతుందని అన్నారు. చిల్లర కూతలు, చిల్లర మాటలు మాట్లాడుతున్న ముఖ్యమంత్రి, మంత్రులను చూస్తే జాలి వేస్తుందని అన్నారు. ఇక ఈ అంతర్గత సమావేశంలోనే జీవన్ రెడ్డిని బీఆర్ఎస్ కార్యవర్గానికి పరిచయం చేశారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డిని పార్టీ జనరల్ సెక్రటరీగా ప్రకటించారు.

## ఢిల్లీ కోటలో ఆర్సీబీ జెండా..

-76 పరుగుల లక్ష్యాన్ని సులభంగా ఛేదించిన ఆర్సీబీ
-విన్నింగ్ షాట్‌తో మ్యాచ్‌ని ఫినిష్ చేసిన కోహ్లి
-బెంగళూరులో ఓటమికి రివేంజ్ తీర్చుకున్న ఆర్సీబీ

**న్యూఢిల్లీ,**
డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఐపీఎల్ 2026లో తన హవా కొనసాగిస్తోంది. విరాట్ కోహ్లి సొంతగడ్డ మీద ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. బౌలింగ్, బ్యాటింగ్‌లో డామినేషన్ ప్రదర్శించిన ఆర్సీబీ ఢిల్లీ క్యాపిటల్స్ అందించిన లక్ష్యాన్ని పవర్ ప్లే లోపే ఛేదించి రికార్డు క్రియేట్ చేసింది. బెంగళూరు వేదికగా దక్కిన ఓటమికి ఈ మ్యాచ్‌లో ఆర్సీబీ రివేంజ్ తీర్చుకుంది.అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు బౌలర్లు, బ్యాటర్లు పూర్తి ఆధిపత్యం ప్రదర్శించారు. టాస్ గెలిచిన ఆర్సీబీ బౌలింగ్ ఎంచుకుని ఢిల్లీని చిత్తు చిత్తు చేసింది. జోష్ హేజిల్‌వుడ్,



భువనేశ్వర్ కుమార్ రెచ్చిపోయి బౌలింగ్ చేయడంతో ఢిల్లీ క్యాపిటల్స్ కేవలం 75 పరుగులకే ఆలౌట్ అయిందిఈజీ టార్గెట్‌తో బరిలోకి దిగిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు కేవలం 6.3 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. ఒకానొక దశలో పవర్ ప్లే లోపే ఆర్సీబీ మ్యాచ్ని ముగిస్తుంది అని అనుకున్నారు. కానీ.. మరో మూడు బంతులు అదనంగా తీసుకుని ఆర్సీబీ ఘన విజయం సాధించింది. కేవలం ఒక్క వికెట్ మాత్రమే కోల్పోయిన ఆర్సీబీకి విరాట్ కోహ్లి విన్నింగ్ షాట్ కొట్టి విజయాన్ని అందించాడు.కైల్ జెమీసన్ వేసిన తొలి ఓవర్‌లో కేవలం 7 పరుగులు మాత్రమే వచ్చాయి. రెండో ఓవర్‌లో కూడా ఆరు పరుగులే రావడంతో తొలి రెండు ఓవర్లలో ఆర్సీబీ 13 పరుగులు మాత్రమే చేసింది. కానీ.. మూడో ఓవర్ నుంచి రెచ్చిపోయి బ్యాటింగ్ చేశారు. జెమీసన్ ఓవర్‌లో బెతెల్ వరుసగా రెండు సిక్సర్లు కొట్టి అవుటయ్యాడు. బెతెల్ అవుటయ్యే సమయానికి ఆర్సీబీ 27/1గా ఉంది.దేవదత్ పడిక్కల్ ఎప్పుడైతే క్రీజులోకి వచ్చాడు అప్పటి నుంచి బౌండరీల మోత మొదలైంది. నాలుగో ఓవర్‌లో 12 పరుగులు రాగా.. ఐదో ఓవర్‌లో 21 పరుగులు రాబట్టారు. పవర్ ప్లే చివరి ఓవర్‌లో కేవలం 5 పరుగులే రావడంతో విజయం కోసం ఏడో ఓవర్ వరకూ ఆగాల్సి వచ్చింది. నటరాజన్ వేసిన ఏడో ఓవర్‌లో విరాట్ కోహ్లి వరుసగా రెండు సిక్సర్లు బాది మ్యాచ్‌ని ముగించాడు. 6.3 ఓవర్లలోనే కేవలం ఒక్క వికెట్ కోల్పోయి ఆర్సీబీ 77 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది. జాకబ్ బెతెల్ 11 బంతుల్లో 20 పరుగులు చేయగా, విరాట్ కోహ్లి 15 బంతుల్లో 23, దేవదత్ పడిక్కల్ 13 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్లతో 34 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచారు.

## మే 4 తర్వాత ప్రమాణస్వీకారానికి మళ్ళీ వస్తా'

మొదటి తరువాయి

అని మోదీ పేర్కొన్నారు.

అదే నా చివరి సభ!

ప్రస్తుత బెంగాల్ ఎన్నికల ప్రచారంలో అదే తన చివరి బహిరంగ సభ అని మోదీ అన్నారు. ఈ ఎన్నికల ఫలితాలు బీజేపీకి అనుకూలంగా వస్తాయని విశ్వాసం వ్యక్తంచేస్తున్నారు. "ఈ ఎన్నికల్లో ఇదే నా చివరి ర్యాలీ. బెంగాల్‌లో నేను ఎక్కడికి వెళ్లినా, అక్కడ ప్రజల మనోభావాలను నేను గమనించాను. మే 4న ఫలితాలు వచ్చిన తర్వాత, బీజేపీ ప్రభుత్వ ప్రమాణ స్వీకార మహోత్సవానికి హాజరయ్యేందుకు నేను తిరిగి వస్తాననే నమ్మకంతో వెళుతున్నాను." అని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. ప్రచార కార్యక్రమాల్లో ప్రజల నుంచి తనకు అందిన సందేశాలు, కానుకల గురించి మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. వాటిని తాను ఎంతో గౌరవిస్తానని తెలిపారు. "బెంగాల్‌లో జరిగిన ర్యాలీలు, రోడ్‌షోల సమయంలో నాకు ఎంతో హృద్యమైన సందేశాలు, చిత్రపటాలను అందించారు. వాటిని నేను ఎప్పటికీ మర్చిపోలేను. కార్యక్రమాలు ముగిసిన తర్వాత రాత్రి వేళల్లో ఆయా చిత్రపటాలను నేను నిశితంగా చూస్తూ, ఆ కళాకారుల భావోద్వేగాలను అర్థం చేసుకుంటాను. నేను ప్రతి సందేశాన్ని, లేఖను చదువుతాను. కొన్నింటిలో మీ బాధ కనిపిస్తుంది, మరికొన్నింటిలో మీ దీవెనలు ఉంటాయి" అని మోదీ చెప్పారు.

నా బాధ్యతలను నెరవేరుస్తా!

ఈ సందర్భంగా దశాబ్దాల తన రాజకీయ ప్రయాణాన్ని మోదీ ప్రస్తావించారు. సంస్కృత, ఎన్నికల బాధ్యతల్లో తాను నిరంతరం నిమగ్నమై ఉన్నానని మోదీ పేర్కొన్నారు. "గత మూడు, నాలుగు దశాబ్దాలుగా నేను దేశంలోని ప్రతి మూలకు ప్రయాణించాను. రాజకీయాల్లోకి వచ్చి, బీజేపీలో చేరినప్పటి నుండి, పార్టీ కార్యకర్తగా నాకు అప్పగించిన ప్రతి బాధ్యతను, ఎన్నికల విధులతో సహా నిర్వహిస్తున్నాను. పగలు, రాత్రి అని గానీ, వాతావరణం ఎలా ఉందని గానీ చూడకుండా నిరంతరం ముందుకు సాగుతుంటాను. నేను ఎల్లప్పుడూ మీ మధ్యనే ఉన్నానని, ప్రశాంతతను పొందుతున్నాను. మీరే నా కుటుంబం" అని ఆయన ఆవేగంగా అన్నారు. ఉత్తర 24 పరగణాల జిల్లాలో ఉన్న బారక్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గం, రెండో దశ ఎన్నికల్లో త్రిముఖ పోటీకి సిద్ధమైంది. ఈ జనరల్ సీటులో ప్రస్తుత ఎమ్మెల్యే తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థి, సినీ దర్శకుడు రాజ్ చక్రవర్తి పోటీ చేస్తున్నారు. సీపీఐ(ఎం) తరపున సుమన్ రంజన్ బందోపాధ్యాయ బరిలోకి దిగారు. బీజేపీ తరపున కౌశిక్ బాగ్చీ రంగంలోకి దిగారు. ఆయన తరపున ప్రధాని మోదీ ఇవాళ ప్రచారం నిర్వహించారు.

## పెట్రోల్.. నో స్టాక్

మొదటి తరువాయి

ఈ ఇంధన సమస్య ఇప్పటి వరకు పొరుగు రాష్ట్రం ఏపీలోనే ఉండగా తాజాగా తెలంగాణలోనూ క్షేత్రస్థాయిలో ఇదే పరిస్థితి కనిపిస్తుండటం వాహనదారులను ఆందోళనలోకి నెడుతోంది. పలు చోట్ల పెట్రోల్ బంకుల వద్ద నో స్టాక్ అనే బోర్డులు ఏర్పాటు దర్శనం ఇస్తుండటంతో స్టాక్ ఉన్న బంక్ ల వద్ద వాహనదారులు కిలోమీటర్ల మేర బారులుతీరుతున్నారు. మేడ్చల్, శామీర్ పేట మండలాల్లో పలు ప్రాంతాల్లో డీజిల్ కొరత తీవ్రంగా కనిపిస్తోంది. ప్రత్యేకంగా ట్రాన్స్‌పోర్ట్ రంగంపై ఈ కొరత ప్రభావం ఎక్కువగా పడుతోంది. ట్రక్కులు గంటల తరబడి బంకుల వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొందరు డ్రైవర్లు దూర ప్రాంతాలకు వెళ్లి డీజిల్ తీసుకురావాల్సి వస్తోంది. మరోవైపు, డిమాండ్ పెరగడం కూడా కొరతకు కారణమని అధికారులు పేర్కొంటున్నారు.

**నో డీజిల్**

ఓ వైపు సోషల్ మీడియాలో వదంతులు, పలు చోట్ల నో స్టాక్ బోర్డులతో నగరంలో మరోసారి పానిక్ పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం పెట్రోల్ తో పోలిస్తే డీజిల్ కొరత ఎక్కువగా ఉంది. చాలా చోట్ల కేవలం పెట్రోల్ మాత్రమే అందుబాటులో ఉందని డీజిల్ స్టాక్ లేదని నిర్వాహకులు చెబుతున్నారు. దీంతో స్టాక్ ఉన్న చోటకు వినియోగదారులు క్యూ కడుతున్నారు. వ్యవసాయ అవసరాలతో పాటు భారీ వాహనాలకు డీజిల్ ఉపయోగిస్తారు. రాబోయే రోజుల్లో పెట్రోల్, డీజిల్ దొరకదనే వదంతులతో వాహనదారులు తీవ్ర ఆందోళనక గురవుతున్నారు. దీంతో డబ్బాలు, డ్రమ్ముల్లో బంకుల నుంచి ఇంధనం తీసుకువెళ్తున్న వారి సంఖ్య పెరిగిపోయింది. ఏపీలో డీజిల్ కొరత కారణంగా అక్కడి ప్రజలు తెలంగాణ బార్డర్ జిల్లాల్లో వచ్చి ఇంధనం కొనుగోలు చేస్తుండటంతో ఆ ప్రాంతాల్లోనూ ఇంధన సమస్య మరింతగా కనిపిస్తోంది.

**క్రెడిట్ ఫెసిలిటీ ఇవ్వకపోవడంతోనే...**

హైదరాబాద్‌లో మల్టీ పెట్రోల్, డీజిల్ కొరతపై పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు అమరేందర్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కేంద్రం చెప్పినా ఆయిల్ కంపెనీలు క్రెడిట్ ఫెసిలిటీ ఇవ్వడం లేదన్నారు. ఇప్పుడు అడ్వాన్స్ పేమెంట్ చేసినా పెట్రోల్, డీజిల్ అందడం లేదని పోర్టల్ లో ట్యాంకర్ కేటాయించినా బంక్ కి మాత్రం రావడం లేదన్నారు. స్టాక్ పెట్టుకూడదనే ఉద్దేశంతో సప్లై నిలిపేశారని చెప్పారు.

కంపెనీలకు నష్టాలు.. డెలివరీలు తగ్గింపు

కాగా, అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు గణనీయంగా పెరుగుతున్నప్పటికీ దేశీయంగా ఇంధన ధరలు పెరగడం లేదు. దీంతో ప్రతి లీటర్ విక్రయంపై చమురు కంపెనీలు భారీగా నష్టాలు చవి చూస్తున్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి.

# సంపాదకీయం

## శాంతి చర్చల పేరుతో దొంగాట !



ప్రపంచం శాంతిగా ఉండడం అటు అమెరికాకుకు, ఇటు ఇజ్రాయిల్‌కు ఇష్టం లేనట్లుగా ఉంది. తానో శాంతి కాముకుడినని చెప్పుకున్న ట్రంప్ చేస్తున్న చర్యలు తీసుకుంటున్న నిర్ణయాలు ప్రపంచాన్ని అశాంతిలోకి నెట్టాయి. దాదాపు రెండు నెలలు కావస్తుందో. ఇరాన్‌పై దాడిని ప్రారంభించిన ఫిబ్రవరి 28 నుంచి ఏప్రిల్ 28 వరకు ..పరిస్థితులు గమనిస్తూ ఇద్దరూ రావణ కుంభకర్ణుల్లా ప్రపంచం మీద విరుచుకు పడుతున్నారు. ఇరాన్ ప్రత్యక్షంగా మిగతా దేశాలు పరోక్షంగా తీవ్రంగా దెబ్బతింటున్నాయి. అయినా రక్తం మరిగిన పులిలా ఈ ఇద్దరూ తమ పంతాన్ని వీడడం లేదు. యుద్ధ ముగింపు కోసం ఆడుతున్న నాటకాలు ప్రజలు గమనిస్తున్నారు. శాంతి చర్చల పేరిట ఇరాన్‌ను గుప్పిట పెట్టుకోవాలని చూస్తున్నారు. గల్ఫ్ చమురు ఉత్పత్తిలో ఎదురవుతున్న అంతరాయం అంతర్జాతీయ ఇంధన మార్కెట్లను కుదిపేస్తోంది. మధ్యప్రాచ్యంలో ఘర్షణలు తలెత్తడానికి ముందు ఉత్పత్తి అయిన ముడి చమురుతో పోలిస్తే రోజుకు సుమారు 14.5 మిలియన్ బ్యారల్స్ ఉత్పత్తి నిలిచిపోయింది. అంటే ఘర్షణకు ముందు జరిగిన ఉత్పత్తిలో 57 శాతం పడిపోయిందని తెలుస్తోంది. పనిలోపనిగా భారత్ చైనాలను నరక కూపాలని ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ఆయన మూర్ఖత్వాన్ని బయటపెట్టాయి. ఇరాన్‌పై ఒత్తడి పెంచడం తప్ప ఇప్పటి వరకు జరిగిన చర్చల్లో ఎలాంటి పురోగతి లేదు. రసాయన ఆయుధాలు ఉన్నాయని గతంలో ఇరాక్‌పై దాడి చేసి, ఇరాక్ అధ్యక్షుడు సద్దం హుస్సేన్‌ను బలి తీసుకున్నారు. అక్కడ రసాయన ఆయుధాలు లేవని తేలింది. ఇప్పుడు ఇరాన్‌లో యురేనియం ఉందని, అణ్వాయుధాలు ఉన్నాయని బుకాయించి ఇరాన్‌పై పనిగట్టుకుని దాడి చేశారు. దేశాధినేత ఖమేనని మట్టుపెట్టారు. రెండు నెలలుగా ప్రపంచ వ్యాప్తంగా చమురు సంక్షోభం ఏర్పడ్డా పట్టించుకోవడం లేదు. స్వదేశంలో ట్రంప్‌కు విపరీతమైన వ్యతిరేకత వస్తున్నా లెక్క చేయడం లేదు. ఈ క్రమంలో ఇస్లామాబాద్ వేదికగా శాంతి చర్చలు ముందుకు సాగడం లేదు. అమెరికా, ఇజ్రాయిల్ డబుల్‌గేమ్ ఆడుతున్నాయనే చర్చ నడుస్తోంది. ఓ వైపు శాంతి చర్చలంటూ దౌత్యం నడుపుతూ.. మరోవైపు అరేబియా సముద్రంలో అమెరికా యుద్ధ నౌకల్ని మోహరింప జేస్తోంది. హర్మ్మాజ్‌పై పట్టు సాధించే ప్రయత్నం చేస్తోంది. ఇరాన్‌ను దిగ్బంధించే యత్నాలను యానుకో లేదు. ఇరాన్, అమెరికా మధ్య చాలా అంశాల్లో ఏకాభిప్రాయం కుదిరినా, కొన్ని విషయాలు ఒప్పందానికి అడ్డంకిగా మారాయని తెలుస్తోంది. ముఖ్యంగా 20 ఏళ్ల పాటు యురేనియం శుద్ధిని నిలిపివేయాలన్న అమెరికా డిమాండ్‌ను ఇరాన్ అంగీకరించాల్సిందేనని ట్రంప్ పట్టుబడుతున్నారు. ఇదే అంశంపై విలేకరులతో మాట్లాడుతూ ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాలను తయారు చేయకూడదన్నదే తమ ఏకైక లక్ష్యమని ట్రంప్ వెల్లడించారు. లెబనాన్‌లో కాల్పుల విరమణ ప్రకటించినా, ఇజ్రాయిల్ వైమానిక దాడులతో జనావాసాలపై విరుచుకుపడుతూనే ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో అమెరికాతో శాంతి చర్చలపై అనిశ్చితి నెలకొన్నదని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా విధిస్తున్న ఇరాన్ ఓడరేవుల దిగ్బంధనం, బెదిరింపుల నడుమ ఆ దేశంతో చర్చలు అసాధ్యమని తేల్చి చెప్పారు. ఇదే విషయాన్ని పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌తో పెజెష్కియాన్ ఫోన్‌లో మాట్లాడారు. శాంతి చర్చలపై ఇరాన్ వైఖరిని స్పష్టం చేశారు. ఇరాన్ తన సార్వభౌమాధికారాన్ని వదులుకోదని, అలాగే ఒత్తిళ్లకు తలొగ్గి ఒప్పందాలు చేసుకోబోదని పెజెష్కియాన్ స్పష్టం చేశారు. ప్రస్తుత ఉద్రిక్తతలకు అమెరికానే కారణమని పెజెష్కియాన్ పేర్కొన్నారు. అమెరికా అనుసరిస్తున్న చర్యలే చర్చలకు ప్రధాన అడ్డంకి ఆయన పాక్ ప్రధానితో చెప్పినట్లు ఓ మీడియా వెల్లడించింది. ఏప్రిల్ 13 నుంచి ఇరాన్ ఓడరేవులను అమెరికా నౌకాదళం దిగ్బంధించిన విషయం తెలిసిందే. ఈ పరిణామం వల్ల ఇరాన్ ఆర్థికంగా తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటోంది. ఇలాంటి దిగ్బంధనాల నడుమ పరస్పర నమ్మకాన్ని పునరుద్ధరించడం అసాధ్యమని పేజెష్కియాన్ వెల్లడించారు. అందుకే ఇరు దేశాల మధ్య చర్చలు జరగాలంటే ముందుగా అమెరికా ఆంక్షలను తొలగించి, చిత్తశుద్ధిని నిరూపించుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.ఇరాన్ వద్ద అణ్వాయుధాలు ఉండకూడదన్న తన షరతును ట్రంప్ ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. ఇరాన్ తమను టెలిఫోన్‌లో సంప్రదించవచ్చునని, వారు ఎప్పుడు కోరుకుంటే అప్పుడు మాట్లాడవచ్చునని ట్రంప్ చెప్పారు. హార్ముజ్ జలసంధి నుంచి మందుపాతరలను తొలగించే పనిలో అమెరికా నౌకాదళం నిమగమైందని ట్రంప్ తెలిపారు. ఇస్లామాబాద్ నుంచి వెళ్లిపోయిన తర్వాత ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాగ్చీ స్పందించారు. ఇప్పటికే తాము ఒక ఫ్రేమ్ వర్క్‌ను పాకిస్తాన్‌కు అందించామని తెలిపారు. యుద్ధాన్ని శాశ్వతంగా ముగించేందుకు ఇది ఒక మంచి మార్గమని ఆయన చెప్పారు. శాంతి చర్చలపై అమెరికాకు నిజంగా ఆసక్తి ఉందా అన్నది అనుమాన మేనని కూడా అన్నారు. ఇకపోతే త్తిడి, బెదిరింపు, స్వాధీనాల నడుమ ఒప్పందం ఎలా సాధ్యపడుతుందని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ ప్రశ్నించారు. పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌తో జరిపిన టెలిఫోన్ సంభాషణ సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్య చేశారని ఇరాన్‌కు చెందిన మెహర్ వార్తా సంస్థ తెలిపింది. చర్చలు, కాల్పుల విరమణ సందర్భాల్లో అమెరికా పదేపదే ఉల్లంఘనలకు పాల్పడుతూనే ఉన్నదని, నిర్బంధాలకు తెగబడుతోందని ఆయన అన్నారు. ఇరాన్ ఓడరేవులపై నిషేధం కాల్పుల విరమణ అవగాహనకు తూట్లు పొడవడమేనని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరాన్ శుద్ధి చేసిన 400 కిలోల యురేనియంను తనకు అప్పగించాలని అమెరికా కోరుతుండగా ఇరాన్ ససేమిరా అంటోంది. ఇరాన్ ఓడరేవులపై అమెరికా ఆంక్షలు ఎత్తివేసే వరకూ హార్ముజ్ జలసంధిని దిగ్బంధిస్తామని ఇరాన్ తేల్చి చెప్పింది. ఒప్పందం కుదిరే వరకూ నిర్బంధం కొనసాగుతుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అంటున్నారు. మొత్తంగా చర్చల పీటముడి వీడేలా లేదు. ప్రపంచం ప్రశాంతంగా నిద్రపోయేలా కూడా లేదు.

# కూకట్పల్లిలో కాంగ్రెస్ నాయకుడు బండి రమేష్‌పై వ్యక్తిగత విమర్శలను ఖండించిన కాంగ్రెస్ నేతలు

**కూకట్పల్లి ఏప్రిల్ 27 (మహాప్రభ)**
కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్‌పై స్థాయి లేని వ్యక్తులతో చేయిస్తున్న విమర్శలను స్థానిక కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఇటీవల నిర్వహించిన పత్రికా సమావేశంలో కూకట్పల్లి నియోజకవర్గంలో గత పది సంవత్సరాల అభివృద్ధిపై ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును బండి రమేష్ ప్రశ్నించిన విషయం తెలిసిందే. ఆ అంశాలపై ఎప్పుడైనా, ఎక్కడైనా బహిరంగ చర్చకు సిద్ధమని ఆయన ప్రకటించినట్లు నాయకులు తెలిపారు. ఈ ప్రశ్నలకు సమాధానం ఇవ్వలేని కొందరు వ్యక్తులు కనీస స్థాయి లేని వారిని ముందుకు తెచ్చి అసత్య ఆరోపణలు చేయిస్తున్నారని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. షంషీగూడ, బాలాజీ నగర్, గోపాలనగర్, కేపీహెచ్‌బీ ప్రాంతాల్లో అక్రమ




నిర్మాణాలను ప్రోత్సహిస్తూ లాభాలు పొందుతున్నవారే ఇటువంటి ప్రకటనలు చేస్తున్నారని పేర్కొన్నారు.
ఈ ప్రకటనల వెనుక ఎమ్మెల్యే ఉన్నారని తాము భావించడం లేదని, అయితే కొంతమంది వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాల కోసం భజన బృందాలను ఉపయోగించి రాజకీయ కుట్రలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఇలాంటి చర్యలు కొనసాగితే అక్రమ నిర్మాణాలు, అక్రమ ఆర్జనలపై సమగ్ర విచారణ కోరుతామని హెచ్చరించారు.
రాజకీయ విమర్శలు ప్రజా సమస్యలు, అభివృద్ధి అంశాలపైనే ఉండాలని, వ్యక్తిగత దూషణలు రాజకీయ సంస్కృతికి విరుద్ధమని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. బండి రమేష్ చేసిన ప్రశ్నలకు కట్టుబడి తాము ఎప్పుడైనా బహిరంగ చర్చకు సిద్ధమని స్పష్టం చేశారు. రాజకీయాలు ప్రజల అభివృద్ధి కోసం ఉండాలే గానీ వ్యక్తిగత స్వార్థాల కోసం కాకూడదని, ఇకపై వ్యక్తిగత విమర్శలు కొనసాగితే తగిన చర్యలు తీసుకుంటామని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు.

# అల్లాపూర్ సర్వే నెం.18 భూమిపై హ్యాట్రిక్ ఎమ్మెల్యే ఆరోపణలు అసత్యం

## కాంగ్రెస్ ఘాటు ఖండన

**కూకట్పల్లి, ఏప్రిల్ 27(మహా ప్రభ)**
అల్లాపూర్ సర్వే నెంబర్-18 ప్రభుత్వ భూమి అంశంపై హ్యాట్రిక్ ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. 4 ఎకరాలు 17 గుంటల ప్రభుత్వ భూమిపై గత 10 సంవత్సరాలుగా మదర్సా నిర్మాణం పేరుతో ప్రజలను మోసం చేస్తూ ఎన్నికల సమయంలో ఓట్లు దండుకున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. అసలు 4.17 ఎకరాల భూమి 2 ఎకరాలకు ఎలా తగ్గిందో ప్రజలకు చెప్పాలని ఎమ్మెల్యేను ప్రశ్నించారు. స్థానిక నాయకులే భూమిని ప్లాట్లుగా మార్చి పేదలకు అమ్మి నిర్మాణాలు చేయించారని పేర్కొన్నారు. ఈ అంశంపై హైడ్రా,




రెవెన్యూ లేదా పోలీస్ శాఖలతో విచారణ జరిపేందుకు సిద్ధమని, ఎలాంటి దర్యాప్తుకైనా పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. పేదలు తెలియక కొనుగోలు చేసిన నిర్మాణాలు తొలగిస్తే వారి బాధకు కారణం అధికార పార్టీ నాయకులేనని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. ప్రజల ప్రశంసలు పొందుతున్న హైడ్రా అధికారులపై నిరాధార విమర్శలు చేయడం మానుకోవాలని సూచించారు. అదేవిధంగా రూ.400 కోట్ల భూమి కబ్జా చేస్తున్నారని కాంగ్రెస్‌పై చేసిన ఆరోపణలు పూర్తిగా అసత్యమని స్పష్టం చేశారు. తమ పార్టీ నాయకుల పేర్లు బయటపెడితే వెంటనే క్రమశిక్షణ చర్యలు తీసుకోవడమే కాకుండా ప్రజలకు క్షమాపణలు చెప్పిస్తామని సవాల్ విసిరారు. రెవెన్యూ మరియు పోలీస్ శాఖలు ఇప్పటికే స్పందించి అక్రమ నిర్మాణాలను కూల్చి కేసులు నమోదు చేసిన విషయాన్ని ప్రజలకు గుర్తుచేశారు. అధికారులపై, కాంగ్రెస్‌పై నిరాధార ఆరోపణలు చేయడం మాని ప్రజల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని ఎమ్మెల్యేకు సూచించారు. 'రాజకీయ లాభం కంటే ప్రజల మేలే ముఖ్యము... కూకట్పల్లి అభివృద్ధే మా లక్ష్యం. ఎక్కడైనా, ఎప్పుడైనా బహిరంగ చర్చకు సిద్ధం" అని కాంగ్రెస్ నాయకులు ప్రకటించారు.

# తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహణ...

**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 27(మహాప్రభ)**
శేరిలింగంపల్లి నియోజకవర్గం చందానగర్ డివిజన్‌లోని బీ.ఆర్.ఎస్ పార్టీ కార్యాలయం వద్ద తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. మాజీ కార్పొరేటర్ బొబ్బ నవత రెడ్డి ఆధ్వర్యంలో, తెలంగాణ మాజీ మినిమం వేజ్ బోర్డ్ చైర్మన్ సామ వెంకట్ రెడ్డి చందానగర్ బీ.ఆర్.ఎస్ పార్టీ నాయకులతో కలిసి పార్టీ జెండాను ఎగురవేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం కోసం పోరాడిన అమరుల త్యాగాలను స్మరించుకున్నారు. రాష్ట్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ




కార్యక్రమంలో మల్లికార్జున్ శర్మ, శ్రీకాంత్, రాజన్న, సలీం, చందర్ రావు, గౌస్, రామ రావు, బాబా, దివ్య రెడ్డి, సునీత, ప్రమోద్, సగేష్ రెడ్డి, శ్రీనివాస్, శివ శంకర్, ఇబ్రహీం, అనంత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి కి ప్రథమ పౌరురాలు


**పాపన్నపేట, ఏప్రిల్ 27 ( మహాప్రభ**
మహిళలకు సమాజంలో సమాన హక్కులు దక్కాల్సింది పోయి తగిన గౌరవం కూడా దక్కడం లేదంటే సొసైటీ అధికారుల నిర్లక్ష్యం తారస్థాయికి చేరింది. ఇష్టానుసారంగా కార్యకలాపాల పనులు సాగిస్తున్నారు. వరిధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభానికి గ్రామ ప్రథమ పౌరురాలైన తనను విస్మరించి కేంద్రం ప్రారంభించారని,దీంతో తనకు అవమానం జరిగిందని, కొత్తపల్లి కుమ్మరి పద్మ జగన్ అన్నారు. సొసైటీ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని మెదక్ కలెక్టరేట్ లో సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. గ్రామంలో సొసైటీ ఆధ్వర్యంలో శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు ప్రారంభించారు .





# సైబర్ మోసాలపై ప్రజలకు తెలంగాణ పోలీసుల హెచ్చరిక

**హైదరాబాద్,**
**ఏప్రిల్ 27( మహ ప్రభ)**
సైబర్ మోసాలకు గురైన వెంటనే బాధితులు అత్యవసర సహాయ నంబర్ 1930కు కాల్ చేయాలని తెలంగాణ పోలీసులు ప్రజలకు సూచించారు. మోసం జరిగిన వెంటనే, ముఖ్యంగా "గోల్డెన్ అవర్"లో ఫిర్యాదు నమోదు చేస్తే పోగొట్టుకున్న డబ్బును తిరిగి పొందే అవకాశాలు గణనీయంగా పెరుగుతాయి.




**ప్రజలు ఈ విషయాలను తప్పనిసరిగా గుర్తుంచుకోవాలి:**
-సైబర్ మోసానికి గురైతే తక్షణమే 1930కు కాల్ చేయాలి
-గోల్డెన్ అవర్‌లో ఫిర్యాదు చేయడం చాలా ముఖ్యము
-మోసగాళ్లు పంపే అనుమానాస్పద లింకులు, మెసేజ్‌లు, కాల్స్‌కి స్పందించకూడదు
-వ్యక్తిగత బ్యాంక్ వివరాలు, ఓటీపీలు ఎవరితోనూ పంచుకోవద్దు
-సైబర్ నేరాలపై అప్రమత్తతతోనే మోసాలను నివారించవచ్చు
-సైబర్ భద్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం ద్వారానే ఈ నేరాలను కట్టడి చేయడం సాధ్యమని పోలీసులు తెలిపారు.
-- తెలంగాణ పోలీస్ విభాగం

# ఎమ్మెల్యే సహకారంతో మహిళల సంఘ భవనం ఏర్పాటుకు భూమి పూజ



**గాంధారి, ఏప్రిల్ 27 (మహాప్రభ)**
ఎల్లారెడ్డి నియోజకవర్గ శాసనసభ్యులు, మదన్ మోహన్ రావు, గాంధారి మండలం మాతుసంఘం గ్రామంలో మహిళా సంఘం భవనం భూమి పూజ చేయడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో సర్పంచ్ మాధోజి వందన-బల్వంత్ రావు, ఉప సర్పంచ్ బుచ్చి స్వామి, వార్డు సభ్యులు, బోడి గంగారం, చిర్ర సంతోష్, నీరడి బాలరాజ్, గైని నవనీత, గాండ్ల లక్ష్మి, చిర్ర రాజమణి, పట్లోళ్ల ఇందిరా బాయ్, మాజీ పిఎసిఎస్ చైర్మన్ వజీర్ ముకుంద్ రావు, మహిళా సంఘాల అధ్యక్షురాలు గౌరీ రాజమణి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శంకర్ రావు, వి డి సి అద్యక్షులు కళ్ళేంపెట సాయిలు, గ్రామస్తులు మహిళా సంఘం భవనం మంజూరు చేసినందుకుగాను గ్రామస్తులు యువకులు మహిళలు హర్షం వ్యక్తం చేశారు.

## నూతన పట్టు వస్త్రాలంకరణ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న

ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్



**దేవరకొండ ఏప్రిల్27 ( మహా ప్రభ)**
నియోజక వర్గం లోని చింతపల్లి మండలంలోని తక్కళ్లపల్లి గ్రామ సర్పంచ్ మేడపు రేణుక - అంజయ్య చిన్నారుల నూతన పట్టు వస్త్రాలంకరణ మహోత్సవ వేడుకల్లో సోమవారం గోడుకొండ్ల,మాల్ గ్రామంలోని జయ ఫంక్షన్ హాల్ లో జరిగిన నూతన పట్టు వస్త్రాలంకరణ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని, చిన్నారులను ఆశీర్వదించి న శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నాగభూషణం, మాజీ ఎంపీపీ భవాని పవన్ కుమార్,మాజీ జడ్పీటీసీ మాస భాస్కర్, మాజీ సర్పంచ్ అనిత నర్సి రెడ్డి,అంగిరేకుల గోవర్ధన్, కొప్పుల జంగయ్య,సర్పంచ్ మెండే వెంకటయ్య,మండల కోశాధికారి గుణమోని కొండల్ యాదవ్, నాయకులు కృష్ణ గౌడ్,రాజేష్, శ్రీశైలం, రామస్వామి, మల్లేష్, రహీమ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జరిగిన బొడ్రాయి విగ్రహ ప్రతిష్ట

-ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే బాలు నాయక్



**దేవరకొండ ఏప్రిల్ 27( మహాప్రభ )**
నియోజకవర్గంలోని చందంపేట మండలంలోని మూర్పునుంతల గ్రామంలో నిర్వహించిన బొడ్రాయి (నాభిశీల ) విగ్రహా ప్రతిష్ట మహోత్సవకార్యక్రమంలో శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు ఆ గ్రామ దేవతల ఆశీస్సులు మూర్పునుంతల గ్రామ ప్రజలపై ఉండి, ఆయురారోగ్యాలతో,సుఖసంతోషాలతో,పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించినట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వివిధ అనుబంధ నాయకులు, ముఖ్య నాయకలు తదితరులు పాల్గొన్నారు.

## దేవరకొండలో ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం

-పాల్గొన్న రాష్ట్ర నాయకులు నేనావత్ కిషన్ నాయక్.



**దేవరకొండ ఏప్రిల్ 27 (మహాప్రభ )**
తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా పుట్టి, నేడు అభివృద్ధికి చిరునామాగా మారిన బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు దేవరకొండ పట్టణంలో ఉత్సాహంగా నిర్వహించారు. పట్టణంలోని 18వ వార్డులో కౌన్సిలర్ లివీరమోని అంజి గౌడ్ లి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు లినేనావత్ కిషన్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరై పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఆత్మగౌరవానికి నిదర్శనం గులాబీ జెండా అని, అభివృద్ధిలో రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలబెట్టిన ఘనత మన పార్టీదని కొనియాడారు. కార్యకర్తలే పార్టీకి బలమని, ప్రతి ఒక్కరూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కేతావత్ భీల్య నాయక్, మండల పార్టీ అధ్యక్షుడు ఎంచీ రెడ్డి, కౌన్సిలర్లు కేతావత్ రూప్లా నాయక్, పొట్ట మధు, పులిజాల జానీ, నాయకులు కేతావత్ హరిలాల్, వేముల రాజు, చంద్రమౌళి, లక్ష్మణ్, ముదిగొండ హరిదాస్ తదితర ముఖ్య నేతలు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేదోడి కల ఇంటి నిర్మాణం- భూమి పూజ

-జనసేన పార్టీ సీనియర్ నాయకులు, చందు నాయక్, కోర్రసాయిరాం నాయక్



**దేవరకొండ ఏప్రిల్ 27( మహాప్రభ )**
పట్టణం కొర్ర తండ గ్రామపంచాయతీలో కోర్ర చందర్ నాయక్ ఇల్లు నిర్మాణం కోసం భూమి పూజ నిర్వహించిన అనంతరం జనసేన పార్టీ సీనియర్ నాయకులు చందు నాయక్ మాట్లాడుతూ.. యువకులు వాళ్ల సొంత కాల మీద నిలబడి ఇల్లు నిర్మించుకుంటున్నందుకు ముఖ్యఅతిథిగా జనసేన పార్టీ సీనియర్ నాయకులు చందు నాయక్ మరియు గ్రామ పెద్దలు కోర్ర సాయిరాం నాయక్ చేతుల మీదుగా భూమి పూజ కొబ్బరికాయలు కొట్టి మట్టి తీసి పనులు ప్రారంభించారు.ముఖ్యఅతిథిగా వారు వచ్చినందుకు ధన్యవాదాలు అభినందలు తెలియజేశారు.వారికి సపోర్టు సహకారం పూర్తిస్థాయిలో ఉంటుందని అన్నారు.ఇల్లు నిర్మాణం కోసం కావాల్సినంత భూమి ఊరి పెద్దలతో చర్చించి ఇల్లు నిర్మాణం కొరకు భూమి ఇప్పించారని చందు నాయక్ అన్నారు ఈ కార్యక్రమంలో కొర్ర సేవు నాయక్ నేనావత్ దేవ్ సింగ్ నాయక్ కోర్ర రమేష్ నాయక్ .మేస్త్రిలు తదితరులు పాల్గొన్నారు.

## మియాపూర్‌లో “విజయ కలెక్షన్స్ లేడీస్ ఎంపోరియం” గ్రాండ్ ఓపెనింగ్

ప్రత్యేక ఆఫర్లతో ప్రారంభం




**మియాపూర్, ఏప్రిల్ 27(మహా ప్రభ)**
మియాపూర్ ప్రాంతంలో మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విజయ కలెక్షన్స్ లేడీస్ ఎంపోరియం గ్రాండ్ ఓపెనింగ్ కార్యక్రమం ఈ నెల 30వ తేదీ సాయంత్రం 5 గంటలకు ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సారీస్, కుర్తీస్, నైటీస్, లెగ్గింగ్స్ మరియు ఇమిటేషన్ జ్యువెలరీ వంటి వివిధ రకాల మహిళల వస్త్రాలు ఒకే చోట అందుబాటులో ఉండనున్నాయి. ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని కస్టమర్లకు ప్రత్యేక ఆఫర్లు ప్రకటించారు. 1599 విలువైన ప్రతి కొనుగోలుపై 20% ఫ్లాట్ డిస్కౌంట్ ఇవ్వనున్నట్లు తెలిపారు. అదనంగా “ మీ అదృష్టాన్ని పరీక్షించుకోండి ” ఆఫర్ ద్వారా ఆకర్షణీయమైన బహుమతులు గెలుచుకునే అవకాశం కూడా కల్పించారు. కస్టమర్‌ను రిఫర్ చేసిన వారికి ప్రత్యేక గిఫ్ట్ అందజేయనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ కొత్త షోరూమ్ షాప్ నం.7, బ్లాక్ నం.02, RBR కాంప్లెక్స్, మియాపూర్ లో ప్రారంభం కానుంది. స్థానిక ప్రజలు భారీగా పాల్గొని ప్రారంభోత్సవ ఆఫర్లను వినియోగించుకోవాలని నిర్వాహకులు ఆహ్వానించారు. సంప్రదించవలసిన నంబర్: 78420 12149

## ప్రజా యుద్ధనౌక గద్దర్ కుమార్తె వెన్నెలమ్మకు ఘన సన్మానం..

-మెదక్ చర్చి ప్రాంగణంలో శాలువాలతో సత్కారం..



**మెదక్ జిల్లా -27ఏప్రిల్ (మహాప్రభ )**
ప్రజా యుద్ధనౌకగా పేరుగాంచిన గద్దర్ కుమార్తె వెన్నెలమ్మ సోమవారం మెదక్‌కు విచ్చేశారు. ఈ సందర్భంగా మెదక్ చర్చి ప్రాంగణంలో మెదక్ గద్దర్, మందుగుల గంగాధర్, సీనియర్ జర్నలిస్ట్ బొందుగుల నాగరాజు శాలువాలతో ఘనంగా సన్మానించారు.వారు గద్దర్ గారి సాహిత్య, సాంస్కృతిక సేవలను స్మరించుకున్నారు.

## శివంపేటలో గో సమ్మాన్ ఆహ్వాన్ అభియాన్ కింద వినతిపత్రం సమర్పణ



**శివంపేట,ఏప్రిల్ 27(మహాప్రభ):**
గో సమ్మాన్ ఆహ్వాన్ అభియాన్‌లో భాగంగా గోమాతను జాతీయ గోమాతగా (జాతీయ ప్రాణిగా) ప్రకటించాలని కోరుతూ, దేశవ్యాప్తంగా పీఠాధిపతులు, స్వామీజీల ప్రోత్సాహంతో నిర్వహిస్తున్న గో ఆరాధన ఉద్యమం కింద ఈరోజు శివంపేట ఎమ్మార్వో కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. దేశంలోని 5500కు పైగా మండలాల్లో ఉన్న ఎమ్మార్వోలకు 27-04-2026న గోమాతను జాతీయ గోమాతగా ప్రకటించాలని కోరుతూ వినతిపత్రాలు అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ వినతిపత్రం రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి, రాష్ట్రపతి మరియు ప్రధాన మంత్రి వరకు చేరే విధంగా రూపొందించబడింది.
ఈ కార్యక్రమంలో స్టేట్ కౌన్సిల్ మెంబర్ కోండల్ రావు, మండల అధ్యక్షుడు పెద్దపులి రవి, జనరల్ సెక్రటరీలు వినోద్ కుమార్, సుధాకర్, అశోక్, ఉపాధ్యక్షుడు నర్సారెడ్డి, బీజేవైఎం అధ్యక్షుడు బాస్కర్, గొప్యా నాయ, క్రిష్ణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## దొంతి గ్రామంలో అనాధ పిల్లలకు ఉచిత వైద్య శిబిరం

- యాంటీ డ్రగ్ కార్యక్రమం నిర్వహణ



**శివంపేట, ఏప్రిల్ 27 (మహాప్రభ):**
దొంతి గ్రామంలోని బేతని సంరక్షణ ఆశ్రమంలో సోమవారం నాడు అనాధ పిల్లల కోసం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సేవలు అందించారు. అదే సందర్భంలో డ్రగ్ డే సందర్భంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్ అవగాహన కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన జీవనం గడపాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమాలను పురస్కరించుకుని దొంతి గ్రామ ఉపసర్పంచ్ భవనగా శ్రీనివాస్ తన సొంత నిధులతో అనాధ పిల్లలకు ఆట వస్తువులు అందజేశారు. ఈ పంపిణీ కార్యక్రమాన్ని తూప్రాన్ డీఎస్పీ, శివంపేట ఎస్ఐ మరియు శివంపేట ఎంపీడీవో చేతుల మీదుగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు పాల్గొని అనాధ పిల్లలకు మద్దతు తెలిపారు.

## బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలోనే దేవరకొండ మున్సిపాలిటీ అభివృద్ధి

-ప్రతి ఇంటింటికీ సురక్షిత తాగు నీరు అందించిన ఘనత తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్
-బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్



**దేవరకొండ ఏప్రిల్ 27 (మహాప్రభ ).**
బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలోనే దేవరకొండ మున్సిపాలిటీ అభివృద్ధి జరిగింది అని బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. సోమవారం దేవరకొండ పట్టణంలోని 16వ వార్డులో తాగు నీటి కోసం బోరు ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.....ప్రతి ఇంటింటికీ సురక్షిత తాగు నీరు అందించిన ఘనత తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అని తెలిపారు.ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ ఘోరంగా విఫలమైందని విమర్శించారు.రాష్ట్ర ప్రజలంతా మళ్ళీ కేసీఆర్ పాలన కోసమే ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

## ఘనంగా బిజెపి పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు జన్మదిన వేడుకలు

బిజెపి పార్టీ పట్టణ అధ్యక్షులు : వస్కుల సుధాకర్



**దేవరకొండ ఏప్రిల్ 27( మహా ప్రభ )**
భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు శ్రీఎన్. రామచంద్ర రావు పుట్టినరోజు సందర్భంగా, భారతీయ జనతా పార్టీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని వయోవృద్ధుల ఆశ్రమంలో నివసిస్తున్న వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. . వయోవృద్ధుల ఆశ్రమంలో ఆశ్రమంలో ఉన్న వృద్ధులకు ఆహారం వడ్డించి, వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. సమాజంలోని నిరుపేదలు, వృద్ధుల పట్ల సేవాభావం కలిగి ఉండాలని పట్టణ అధ్యక్షులు వస్కుల సుధాకర్ అన్నారు . శ్రీ ఎన్. రామచంద్ర రావు సేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు బెజవాడ శేఖర్,నక్క వెంకటేశ్వర్లు, జిల్లా కౌన్సిల్ మెంబర్ గుండాల అంజయ్య, జల్దభాస్కర్ పట్టణ ప్రధాన కార్యదర్శులు సముద్రాల సహదేవ్, చిత్రీయాల నాగేంద్ర, కోశాధికారి నీల సుమన్, చండీశ్వర్,రెడ్డి శంకర్ గంజి హరి,ఎర్రబిక్షపతి,తిరుపతి గౌడ్ అవారీ శేఖర్, పున్న నాగరాజు, చిత్రం ఉదయ్ తదితరులు పాల్గొన్నారు

## వైకుంఠ రథాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యేనేనావత్ బాలు నాయక్



**దేవరకొండ ఏప్రిల్ 27 ( మహా ప్రభ)**
నియోజక కవర్గం లోని చింతపల్లి మండల కేంద్రంలో దాచేపల్లి పద్మ జ్ఞాపకార్థం, దాచేపల్లి యాదయ్య కుటుంబ సభ్యుల దాతల సహకారంతో కొనుగోలు చేసిన గ్రామ పంచాయతీ దహన సంస్కారాల కోసం ఉచితంగా ఏర్పాటు చేసిన వైకుంఠ రథాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..చింతపల్లి గ్రామంలో దహన సంస్కారాల కోసం వైకుంఠ రథాన్ని కొనుగోలు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమాన్ని కృషి చేస్తుందని ఆయన వెల్లడించారు. చింతపల్లి గ్రామంలో ఎవరైనా మరణిస్తే వారిని వైకుంఠ రథం ద్వారా ఉచితంగా స్మశాన వాటికక తీసుకపోవడానికి అందుకుగాను ఎలాంటి రుసుము చెల్లించవలసిన అవసరం లేదని, పూర్తిగా గ్రామ పంచాయతీ ఖర్చులు భరిస్తుందని ఆయన తెలిపారు. ఈ వైకుంఠ రథాన్ని ప్రతి ఒక్కరూ పేద, ధనిక, తేడా లేకుండా సద్వినియోగం చేసుకోవాలని ఆయపెర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, ముఖ్య నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆవిర్భవ దినోత్సవం




**పాపన్నపేట ఏప్రిల్ 27 (మహాప్రభ )**
భారాస ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం కొత్తపల్లి ఘనంగా నిర్వహించారు.పార్టీ గులాబీ జెండాను ఎగురావేశారు. ఈసందర్భంగా గ్రామ ఉపసర్పంచ్ రాము,బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడురామక్రిష్ణ, నాయకులు..నారగౌడ్,దుర్గయ్య, భూమేష్,ఎల్లప్ప, వెంకటేశం, సిద్దిరాములు, దుర్గాదాస్, సోమశేఖర్,నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

# మెదక్‌లో బీఆర్ఎస్‌కు భారీ షాక్..

-కాంగ్రెస్‌లోకి కొట్టాల లలిత చేరిక సంచలనం..
-మైనంపల్లి రోహిత్ వ్యూహాలతో కాంగ్రెస్ బలం పెరుగుతోంది..



**మెదక్ జిల్లా ఏప్రిల్ 27 (మహాప్రభ):**
మెదక్ రాజకీయాల్లో కీలక మలుపు చోటుచేసుకుంది. పట్టణంలోని 3వ వార్డు కౌన్సిలర్ కొట్టాల. లలిత విశ్వం కాంగ్రెస్ పార్టీలో చేరడం జిల్లాలో రాజకీయంగా సంచలనంగా మారింది. వరుసగా ఎదురుదెబ్బలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్‌కు ఇది భారీ షాక్‌గా భావిస్తున్నారు.సీనియర్ నాయకుడు విశ్వం కూడా కాంగ్రెస్ గూటికి చేరడం ప్రాధాన్యత సంతరించుకుంది. సోమవారం ఆవుసులపల్లిలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మైనంపల్లి హనుమంతరావు, లలితమ్మ--విశ్వం దంపతులకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ఆకర్షితులై కౌన్సిలర్లు అభివృద్ధి కోసం పార్టీలో చేరుతున్నారని తెలిపారు. మరోవైపు మైనంపల్లి రోహిత్ తన రాజకీయ వ్యూహాలతో మెదక్‌లో కాంగ్రెస్ బలం క్రమంగా పెంచుతున్నట్లు స్పష్టమవుతోంది. మెదక్ పట్టణంలో అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్న పరిస్థితుల్లో కౌన్సిలర్లు, నాయకులు కాంగ్రెస్ వైపు ఆకర్షితులవుతున్నారని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం. గంగాధర్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాగి అశోక్, మాజీ కౌన్సిలర్లు సమీయొద్దీన్, నర్వ లక్ష్మీనారాయణ గౌడ్, కాంగ్రెస్ నాయకులు మహిపాల్, బొజ్జ పవన్, భూపతిరాజ్, చింతల నర్సింలు, రాజు, రమేష్, రాజేష్, మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కూకట్‌పల్లి డివిజన్‌లో ఘనంగా బీఆర్ఎస్ 26వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు





**కూకట్పల్లి, ఏప్రిల్ 27 (మహా ప్రభ)**
కూకట్‌పల్లి డివిజన్‌లో బీఆర్ఎస్ పార్టీ 26వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నాయకత్వంలో ఉద్యమ కాలం నుండి నేటి వరకు పార్టీతో కలిసి నడుస్తున్న ప్రతి కార్యకర్తకు ఈ సందర్భంగా నాయకులు వందనాలు తెలిపారు.
అభివృద్ధి మరియు సంక్షేమమే పార్టీ ప్రధాన ధ్యేయమని పేర్కొంటూ, అదే దిశగా ముందుకు సాగాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డివిజన్ ముఖ్య నాయకులు, పార్టీ కార్యకర్తలు మరియు కేసీఆర్ అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి నాయకుడు, కార్యకర్త మరియు అభిమానులకు కూకట్‌పల్లి బీఆర్ఎస్ కుటుంబం ధన్యవాదాలు తెలియజేసింది. కేసీఆర్ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నాయకులు ఆకాంక్ష వ్యక్తం చేశారు.

## బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**తొర్రూర్-ఏప్రిల్ 27 (మహాప్రభ):**
హరిపిరాల గ్రామంలో భారత రాష్ట్ర సమితి ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ శాఖ అధ్యక్షుడు కొండా వెంకన్న పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన తెలంగాణ స్వరాష్ట్ర సాధన కోసం 2001లో కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు స్థాపించిన తెలంగాణ రాష్ట్ర సమితి ఉద్యమ పార్టీగా ప్రారంభమై, 14 సంవత్సరాల పాటు నిరంతర పోరాటం సాగించిందన్నారు. ఉద్యమంలో విద్యార్థుల త్యాగాలు, మేధావుల ఆలోచనలు, సామాన్య ప్రజల సహకారం కలిసి తెలంగాణ రాష్ట్ర సాధనకు దారితీశాయని పేర్కొన్నారు. అనంతరం పదేళ్లపాటు రాష్ట్రాన్ని పరిపాలించి, ప్రజల మనసుల్లో కెసిఆర్ చెరగని ముద్ర వేసుకున్నారని తెలిపారు. సర్పంచ్ చెంచర్ల స్వాతి రాజు ఉపసర్పంచ్ కూన వెంకన్న బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు కొండా వెంకన్న వార్డు సభ్యులు బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయడం జరిగింది భారీ సంఖ్యలో తదితరులు హాజరయ్యారు

## ఇంజినీరింగ్ కళాశాలలో గేట్ ఉచిత తర్ఫీదు ప్రారంభం



**హుస్నాబాద్, ఏప్రిల్ 27 (మహాప్రభ):**
హుస్నాబాద్ మండల కేంద్ర శివారులోని కిషన్ నగర్‌లో శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలోని ఇంజినీరింగ్ కళాశాలలో గేట్ (గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్) పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఐఈఎస్ అభ్యర్థి చింతల రమేష్ విద్యార్థులకు మార్గనిర్దేశం చేస్తూ, మే 1 నుండి గేట్ పరీక్షకు ఉచిత తర్ఫీదు తరగతులు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. గేట్ సిద్ధతకు అవసరమైన సబ్జెక్ట్ ప్రణాళిక, సమయ నిర్వహణ, పరీక్ష వ్యూహాలు వంటి అంశాలపై వివరించారు. అలాగే ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలు, పరిశోధన రంగాలపై విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపక బృందం చింతల రమేష్‌ను శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో శాతవాహన యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఉమేష్ కుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సతీష్ కుమార్, కళాశాల ప్రిన్సిపల్ డా. తిరుపతి రెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మి రామ్ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పోతారం గ్రామానికి వీధి దీపాల పంపిణీ



**నర్సాపూర్,ఏప్రిల్ 27 (మహాప్రభ):**
మనోహరాబాద్ మండలం పోతారం గ్రామపంచాయతీ పరిధిలో శ్రీ లక్ష్మి రామ్ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 25 లైట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మైనంపల్లి హనుమంత్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి, మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, సర్పంచ్‌లు పోతారం వినోద మహేందర్, కాల్లకల్ నవ్య నాగరాజ్ గౌడ్, కూచారం గుజ్జు రఘు, దండుపల్లి మరాటి నాగరాజు, గౌతోజిగూడం నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు మరియు వివిధ విభాగాల కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. గ్రామంలో వీధి దీపాల ఏర్పాటు ద్వారా ప్రజలకు సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నాయకులు తెలిపారు.

## పునరావాస సమస్యలపై కలెక్టర్‌తో చర్చ




**అమ్రాబాద్, ఏప్రిల్ 27 (మహాప్రభ):**
వటవర్లపల్లి పునరావాస కమిటీ సభ్యులు సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో కొత్తగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్‌ను కలిశారు. తమ గ్రామాల పునరావాస పనులు వేగవంతం చేయాలని, మౌలిక వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.కమిటీ సభ్యులు పునరావాస కేంద్రాల్లో సాంకేతిక సమస్యల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి పనులు వేగవంతం చేస్తానని హామీ ఇచ్చారు.కలెక్టర్‌ను కలిసిన వారిలో కమిటీ అధ్యక్షుడు అప్పిస్ సాయి, ఉపాధ్యక్షుడు చారగొండ బాలకృష్ణ, సభ్యులు ఎండి మాక్సూద్, ఎండి కరీం, జైపాల్ నాయక్, చిర్రా రాములు, బుచ్చయ్య తదితరులు ఉన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలి

- కలెక్టర్ కె. హైమావతి



**సిద్ధిపేట, ఏప్రిల్ 27 (మహాప్రభ):**
ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వచ్చిన దరఖాస్తులను సత్వరంగా పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు తగిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆదేశించారు.సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజల వినతులను కలెక్టర్ అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలిసి స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలు పరిష్కారం అవుతాయనే నమ్మకంతో ప్రజావాణి కార్యక్రమానికి వస్తారని, అందువల్ల అధికారులు దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హతల మేరకు వెంటనే పరిష్కరించే దిశగా కృషి చేయాలని సూచించారు.జిల్లాలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మొత్తం 98 దరఖాస్తులు స్వీకరించబడ్డాయని కలెక్టర్ వెల్లడించారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ నాగరాజమ్మ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గోమాతను జాతీయమాత గుర్తించాలి

-తహశీల్దార్ కి వినతి పత్రం



**గాంధారి, ఏప్రిల్ 27 (మహాప్రభ):**
గోమాతను హిందూ ధర్మం ప్రకారం గోమాతలో దేవుని దేవతలు,చూస్తున్న హిందువులు జాతీయ జంతువుగా ప్రకటించాలని కోరుతూ గాంధారి మండల కేంద్రంలో హిందూ ఐక్యవేదిక నాయకులు, వి డి సి సభ్యులు, తహశీల్దార్ రేణుకా చౌహాను వినతిపత్రం అందజేశారు. సనాతన ధర్మంలో గోవుకు విశిష్ట స్థానం ఉందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి గోమాతకు జాతీయ హోదా కల్పించాలని హిందూ యువజన సంఘ నాయకులు, గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆకుల రామస్వామి, రావ్ సాహెబ్ రావ్, శంకర్ రావు, మహేష్, ఇతర గ్రామస్తులు, పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## కాళోజీ నగర్ సమస్య పరిష్కారం



**కరీంనగర్, ఏప్రిల్ 27 (మహాప్రభ):**
కాళోజీ నగర్ ప్రజలందరికీ సంబంధించిన మెయిన్ రోడ్డు డివైడర్ సమస్యను రమణారెడ్డి, దావ శ్రీనివాస్ రెడ్డి, సమ్మిరెడ్డి, కంకణాల అశోక్ 19వ డివిజన్ కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు.వెంటనే స్పందించిన 19వ డివిజన్ కార్పొరేటర్ సుధగోని మాధవి--కృష్ణ గౌడ్ సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా కాళోజీ నగర్ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ప్రజల భద్రత కోసం తీసుకున్న ఈ చర్య స్థానికులకు ఉపశమనం కలిగించింది.

## రోడ్డు సమస్యను పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి


**పాలకుర్తి, ఏప్రిల్ 27 (మహాప్రభ):**
పాలకుర్తి మండలం కుక్కలగూడూరు గ్రామం నుండి ధర్మారం ఎక్స్‌రోడ్ వరకు ఉన్న డబుల్ రోడ్డుపై గుంతలను పూడ్చాలని బసంతనగర్ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పెద్దపల్లి జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు.ప్రస్తుతం ఐకేపీ కేంద్రాల నుండి లారీలలో వడ్ల బస్తాలను తరలిస్తున్న సమయంలో రోడ్డు మొత్తం గుంతలతో నిండిపోవడంతో బస్తాలు జారి రోడ్డుపై పడుతున్నాయని, లారీలు దెబ్బతింటున్నాయని వారు



ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో లారీ యజమానులు ఆర్థిక నష్టాలు ఎదుర్కొంటున్నారని, ఇతర వాహనాలు కూడా ప్రమాదాలకు గురవుతున్నాయని పేర్కొన్నారు. కుర్మపల్లి మూల మలుపు వద్ద రోడ్డు మరీ అధ్వాన్నంగా ఉందని, తక్షణమే మరమ్మతులు చేపట్టాలని సంఘం అధ్యక్షుడు మేకల సదానందం, ఉపాధ్యక్షుడు పెసరి మల్లేష్ లేఖలో కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.


# బిజినెస్

## అల్ట్రాటెక్ లాభం 3 వేల కోట్లు




**న్యూఢిల్లీ, ఏప్రిల్ 27**
అల్ట్రాటెక్ సిమెంట్ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. మార్చితో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.3,000 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది.అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.2,474.79 కోట్ల లాభంతో పోలిస్తే రెండంకెల వృద్ధిని నమోదు చేసుకున్నది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.25,799 కోట్లకు ఎగబాకింది


## రోల్స్-రాయిస్‌తో సిగ్మా జట్టు




**హైదరాబాద్,**
రాష్ట్రానికి చెందిన సిగ్మా అడ్వాన్స్‌డ్ సిస్టమ్.. రోల్స్-రాయిస్‌తో జట్టుకట్టింది. ఇరు సంస్థల మధ్య కుదిరిన ఒప్పందంలో భాగంగా సిగ్మా ఏరోస్పేస్ సిస్టమ్‌కు సంబంధించిన కీలక విడిభాగాలు తయారు చేయడంతోపాటు సరఫరా చేయాల్సి వుంటుందని పేర్కొంది.ఈ ఒప్పందం విలువ రూ.3,800 కోట్ల స్థాయిలో ఉంటుందని అంచనా. అంతర్జాతీయ వ్యాపార విస్తరణలో భాగంగా రోల్స్-రాయిస్‌తో జట్టుకట్టినట్టు, తద్వారా గ్లోబల్ మార్కెట్లో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవడానికి దోహ దం చేయనున్నదని కంపెనీ సీఈవో, ఈడీ సునీల్ కుమార్ తెలిపారు.

# కదంతొక్కిన సూచీలు.
# సెన్సెక్స్ 639, నిఫ్టీ 195 పాయింట్ల లాభం

**ముంబై,**
: దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస పతనాలకు బ్రేక్ పడింది. బ్లూచిప్ సంస్థలైన రిలయన్స్, సన్‌ఫార్మా షేర్లకు మదుపర్ల నుంచి లభించిన మద్దతుతోపాటు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలు సూచీల్లో జోష్ పెంచాయి. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు త్వరలో తగ్గుముఖం పట్టే అవకాశాలున్నట్టు వచ్చిన వార్తలు మదుపర్లను కొనుగోలు వైపు నడిపించాయి. ఇంట్రాడేలో 700 పాయింట్లకు పైగా ఎగబాకిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 639.42 పాయింట్లు లాభపడి 77,303.63 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ 194.75 పాయింట్లు అందుకొని 24,092.70 వద్ద స్థిరపడింది.



**రిలయన్స్ షేరు జోరు**
గత త్రైమాసికంలో నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించినప్పటికీ రిలయన్స్ షేరు భారీగా పుంజుకున్నది. బ్లూచిప్ సంస్థల షేర్లలో అత్యధిక విలువ కలిగిన రిలయన్స్ షేరు ఇంట్రాడేలో మూడు శాతానికి పైగా లాభపడిన షేరు చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 2.88 శాతం అందుకొని రూ.1,365.95 వద్ద ముగిసింది. అటు ఎన్‌ఎస్‌ఈ లోనూ 2.86 శాతం ఎగబాకి రూ.1,365.80 వద్ద స్థిరపడింది. దీంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ విలువ రూ.51,837.41 కోట్లు పెరిగి రూ.18,48,477.13 కోట్లకు చేరుకున్నది.

-సన్‌ఫార్మా షేరు 7 శాతం ఎగబాకి టాప్ గెయినర్‌గా నిలిచింది. అమెరికాకు చెందిన ఆర్గానన్ అండ్ కో సంస్థను కొనుగోలు చేయనున్నట్టు ప్రకటించడంతో షేరు ధర రివ్వున ఎగిసింది.
-అదానీ పోర్ట్స్, టెక్ మహీంద్రా, మహీంద్రా అండ్ మహీంద్రా, ఎన్‌టీపీసీ, హెచ్‌సీఎల్, టీసీఎస్, టాటా స్టీల్, కొటక్ బ్యాంక్, పవర్‌గ్రిడ్, మారుతి, ఇన్ఫోసిస్ షేర్లు ఒక్క శాతంకు పైగా బలపడ్డాయి.
-వీటితోపాటు ఎస్బీఐ, ఎల్‌అండ్‌టీ, ఇండిగో, టైటాన్, ఐటీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, బజాజ్ ఫైనాన్స్, అల్ట్రాటెక్ సిమెంట్, ఏషియన్ పెయింట్స్ షేర్లు లాభపడ్డాయి.
హెచ్‌యూఎల్, ఎటర్నల్, ఐసీఐసీఐ బ్యాంక్, ట్రెంట్, బీఈఎల్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు 3 శాతం వరకు నష్టపోయాయి.
-అన్ని రంగాల షేర్లు కదంతొక్కాయి. యుటిలిటీ రంగ షేరు అత్యధికంగా 2.50 శాతం లాభపడగా, హెల్త్‌కేర్ 2.43 శాతం, ఐటీ 2.41 శాతం, రియల్టీ 2.35 శాతం, పవర్ 2.05 శాతం, సర్వీసెస్ 1.92 శాతం చొప్పున బలపడ్డాయి.

# యూకో బ్యాంక్ లాభం 801 కోటు


**న్యూఢిల్లీ,ఏప్రిల్ 27**
ప్రభుత్వరంగ సంస్థ యూకో బ్యాంక్ ప్రోత్సాహకర ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. గడిచిన ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికానికిగాను రూ.801 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.653 కోట్ల లాభంతో పోలిస్తే 22.66 శాతం వృద్ధిని కనబరిచింది. లాభాల్లో భారీ వృద్ధిని కనబరిచిన బ్యాంక్ ఆదాయం మాత్రం రూ.8,137 కోట్ల నుంచి రూ.7,365 కోట్లకు తగ్గినట్టు పేర్కొంది. దీంట్లో వడ్డీల మీద వచ్చే ఆదాయం రూ.6,656 కోట్లుగా ఉన్నది.మరోవైపు, ఆర్థిక ఫలితాల విడుదల సందర్భంగా సమావేశమైన బ్యాంక్ బోర్డు రూ.10 ముఖ విలువ కలిగిన ప్రతిషేరుకూ 44 పైసలు లేదా 4.40 శాతం డివిడెండ్‌ను ప్రకటించింది. సమీక్షకాలంలో బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 2.69 శాతం నుంచి 2.17 శాతానికి తగ్గగా, నికర ఎన్‌పీఏ 0.5 శాతం నుంచి 0.27 శాతానికి దిగొచ్చింది. అలాగే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో క్యూఐపీ, ఎఫ్‌పీవోతోపాటు ఇతర రూట్లలో రూ.2,700 కోట్ల నిధులను సేకరించడానికి బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మార్చి చివరినాటికి బ్యాంక్ మొత్తం వ్యాపారం రూ.5,90,314 కోట్లుగా నమోదైంది. ప్రస్తుతం బ్యాంక్ దేశవ్యాప్తంగా 3,412 శాఖలను నిర్వహిస్తున్నది.




# స్పోర్ట్స్

## ధోనీ రికార్డును అధిగమించిన రింకూ సింగ్

ఐపీఎల్ 2026 సీజన్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ స్టార్ ఫినిషర్ రింకూ సింగ్ తన బ్యాట్‌తో సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఆదివారం లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన పోరులో రింకూ సింగ్ అసాధారణ ఇన్నింగ్స్ ఆడి ఏకంగా మహేంద్ర సింగ్ ధోనీ పేరిట ఉన్న 15 ఏళ్ల నాటి రికార్డును బద్దలు కొట్టాడు. ఈ మ్యాచ్‌లో కేవలం 51 బంతుల్లోనే 7 ఫోర్లు, 5 సిక్సర్ల సాయంతో 83 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. కష్టాల్లో ఉన్న జట్టును సునీల్ నరైన్ తో కలిసి ఆదుకున్న రింకూ, కోల్‌కతా స్కోరును 150 మార్కు దాటించడంలో కీలక పాత్ర పోషించాడు. ఐపీఎల్ చరిత్రలో ఆరో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా రింకూ సింగ్ ఇప్పుడు అగ్రస్థానానికి చేరుకున్నాడు. గతంలో ఈ రికార్డు ఎంఎస్ ధోనీ పేరిట ఉండేది. 2011లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన మ్యాచ్‌లో ధోనీ ఆరో స్థానంలో వచ్చి 40 బంతుల్లో 70 పరుగులు చేసి నాటౌట్ గా నిలిచాడు. సరిగ్గా 15 ఏళ్ల తర్వాత రింకూ సింగ్ 83 పరుగులతో ఆ రికార్డును తుడిచిపెట్టేశాడు. రింకూ నిలకడైన ఆటతీరు, ప్రెజర్ లో కూడా సిక్సర్లు బాదగలిగే సామర్థ్యం కేకేఆర్ జట్టుకు పెద్ద ప్లస్ పాయింట్ గా మారింది. ఒకవైపు రింకూ సింగ్ రికార్డుతో క్రికెట్ ఫ్యాన్స్ ఖుషీ అవుతుంటే, మరోవైపు



చెన్నై సూపర్ కింగ్స్ అభిమానులకు కోలుకోలేని వార్త అందింది. ఎంఎస్ ధోనీ ఐపీఎల్ 2026 సీజన్ లో ఆడే విషయంలో ఇంకా సందిగ్ధత కొనసాగుతోంది. వార్మప్ మ్యాచ్ సమయంలో ధోనీకి కాలి కండరాల గాయం తిరగబెట్టడంతో అతను మైదానంలోకి అడుగుపెట్టడం మరింత ఆలస్యం కానుంది. ఈ విషయాన్ని చెన్నై హెడ్ కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ అధికారికంగా ధృవీకరించాడు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు సీఎస్‌కే ఆడిన ఎనిమిది మ్యాచ్‌లకు ధోనీ దూరంగా ఉన్నాడు. ధోనీ ఆడటానికి చాలా ఆసక్తిగా ఉన్నాడని, కానీ కాలి గాయం చాలా ఇబ్బంది పెడుతోందని ఫ్లెమింగ్ తెలిపాడు. ఒకవేళ కోలుకోకముందే అతను మైదానంలోకి దిగి మళ్ళీ గాయం పెద్దదైతే ఇక ఈ సీజన్ కే దూరం కావాల్సి వస్తుందని, అందుకే తాము చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నామని పేర్కొన్నాడు. ఒక వార్మప్ గేమ్ లో ప్రాక్టీస్ చేస్తుండగా మళ్ళీ నొప్పి మొదలైందని, ప్రస్తుతం అతను టీమ్ ఫిజియోలతో కలిసి వర్క్ చేస్తున్నాడని తెలిపాడు. అంతా సవ్యంగా జరిగితేనే అతను తుది జట్టులోకి వస్తాడని, ప్రస్తుతానికి మాత్రం అతని రాకపై క్లారిటీ లేదని ఫ్లెమింగ్ మీడియా సమావేశంలో వివరించాడు. ముంబై ఇండియన్స్‌తో జరిగే తదుపరి మ్యాచ్‌కు ముందు చెన్నై జట్టుకు ఐదు రోజుల విరామం లభించింది. ఈ సమయంలో ధోనీ కోలుకుంటాడని అభిమానులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ప్రాక్టీస్ సెషన్లలో ధోనీ వికెట్ కీపింగ్ డ్రిల్స్ చేస్తూ కనిపించడం చూసి, అతను త్వరలోనే వస్తాడని అందరూ అనుకున్నారు. కానీ ఫ్లెమింగ్ ఇచ్చిన తాజా అప్‌డేట్ ప్రకారం ధోనీ రీఎంట్రీ ఇప్పుడప్పుడే ఉండేలా కనిపించడం లేదు. రింకూ రికార్డుతో కేకేఆర్ పండగ చేసుకుంటుంటే, ధోనీ లేని లోటుతో సీఎస్‌కే శిబిరం ఆలోచనలో పడింది.

## ఓటమితో ముగించిన అమ్మాయిలు



**జెనొని**
మరికొద్దిరోజుల్లో ఇంగ్లండ్ వేదికగా జరుగబోయే మహిళల టీ20 ప్రపంచకప్‌నకు సన్నాహకంగా దక్షిణాఫ్రికాతో జరిగిన ఐదు టీ20ల సిరీస్‌ను భారత జట్టు ఓటమితో ముగించింది. తొలి మూడు మ్యాచ్‌ల్లో ఓడి సిరీస్ కోల్పోయిన హర్మన్‌ప్రీత్ కౌర్ సేన.. నాలుగో మ్యాచ్‌లో గెలిచినా ఇరుజట్ల మధ్య సోమవారం జరిగిన ఐదో టీ20లో 23 పరుగుల తేడాతో ఓటమిని మూటగట్టుకుంది. తొలుత దక్షిణాఫ్రికా.. కెప్టెన్ లారా వోల్వార్ట్ (56 బంతుల్లో 92 నాటౌట్, 11 ఫోర్లు, 2 సిక్స్‌లు) పోరాటంతో 20 ఓవర్లకు 6 వికెట్లు నష్టపోయి 155 రన్స్ చేసింది.భారత బౌలర్లలో రేణుకా (2/21), శ్రీ చరణి (2/22), దీప్తి (2/37) తలా రెండు వికెట్లు పడగొట్టారు. స్వల్ప ఛేదనే అయినప్పటికీ ఉమెన్ ఇన్ బ్లూ.. నిర్ణీత ఓవర్లలో 132/8 వద్దే ఆగిపోయింది. ఫల్మలి (40), రిచా ఘోష్ (25 నాటౌట్) పోరాటం సరిపోలేదు. ఈ గెలుపుతో సిరీస్‌ను దక్షిణాఫ్రికా 4-1తో గెలుచుకుంది. సిరీస్‌లో 330 పరుగులు చేసిన వోల్వార్ట్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌తో పాటు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డులూ దక్కాయి.

## ఫొటోకు రూ.100 తీసుకుంటా’..

### అభిమానులపై ప్రాంక్ చేసిన వైభవ్..!

ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్‌లో వీరకొట్టుడుతో వైరలవుతున్న వైభవ్ సూర్యవంశీ ఆటకు సలాం కొడుతున్నారంతా. ప్రపంచస్థాయి బౌలర్లకు చుక్కలు చూపిస్తున్న ఈ కుర్రాడు ఎక్కడ కనపడినా సెల్ఫీ ప్లీజ్.. ఒక్క ఫొటో అని అభిమానులు గుమికూడుతున్నారు. పదిహేనేళ్లున్న వైభవ్ తన వయసుకు తగ్గ అల్లరితో ఆశ్చర్యపరుస్తున్నాడు. అందులో భాగంగానే తనతో ఫొటో దిగేందుకు వచ్చిన వాళ్లతో నేను రూ.100 తీసుకుంటా అని ఈ చిచ్చరపిడుగు చెప్పాడు.రాజస్థాన్ రాయల్స్ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీని విమానాశ్రయంలో ఇద్దరు చిన్నారులు ఫొటో అడిగారు. అందుకు అతడు ‘బ్రదర్ నేను ఫొటోకు డబ్బులు తీసుకుంటా. నేను నిజయతీగానే చెబుతున్నా. నేను వంద రూపాయలు తీసుకుంటా’ అని వారితో చెప్పాడు. అతడలా పైసలు తీసుకుంటా అనేసరికి ఆ చిన్నారులు





షాకయ్యారు. వెంటనే తమ తల్లిదండ్రుల దగ్గరకు వెళ్లి రూ.200 తీసుకొచ్చి.. వైభవ్‌కు ఇవ్వబోయారు.అయితే.. తనకు డబ్బులు వద్దని, ఆటపట్టించేందుకు తాను అలా చెప్పానని అన్నాడు. ఆ తర్వాత ఫొటో దిగి వారిని సంతోషపరిచాడీ ఐపీఎల్ స్టార్. రాజస్థాన్ యాజమాన్యం ఎక్స్‌లో ఈ వీడియోను పోస్ట్ చేసింది. ప్రస్తుతం నెట్టింట వైరలవుతున్న ఈ వీడియో చూసినవాళ్లంతా ‘క్రికెట్‌లో స్టార్‌గా అవతరించిన వైభవ్‌లో కుర్ర చేష్టలు పోలేదు’ అని ఫన్నీగా కామెంట్లు పెడుతున్నారు. పంతొమ్మిదో సీజన్‌లో 36 బంతుల్లోనే వేగవంతమైన శతకంతో రికార్డు నెలకొల్పాడు వైభవ్ సూర్యవంశీ. ఎనిమిది మ్యాచుల్లో ఈ విధ్వంసక ఆటగాడు 234.87 స్ట్రయిక్ రేటేతో 357 రన్స్ కొట్టాడు.భారత క్రికెట్‌లో శరవేగంగా దూసుకెళ్తున్న వైభవ్ సూర్యవంశీ ఆటకు రికార్డులు బద్ధలవుతున్నాయి. ఈ ఏడాది అండర్-19 వరల్డ్‌కప్‌లో భారీ శతకంతో టీమిండియాను గెలిపించిన వైభవ్.. ఐపీఎల్‌లో రెండో శతకం బాదేశాడు. పంతొమ్మిదో సీజన్‌లో బుమ్రా, సిరాజ్, కమిన్స్ లాంటి తోపు బౌలర్లను ఉతికేస్తున్న ఈ చిచ్చరపిడుగు 36 బంతుల్లో వంద కొట్టేశాడు. జైపూర్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ బౌలర్లకు చుక్కలు చూపిస్తూ ఐపీఎల్‌లో మూడో వేగవంతమైన సెంచరీ నమోదు చేశాడు

# నమస్తే మహాప్రభ

## జూన్ 25న పెద్ది విడుదల ఖాయం

### దర్శకుడు సానా బుచ్చిబాబు వెల్లడి




రామ్‌చరణ్ హీరోగా నటిస్తున్న 'పెద్ది' చిత్రం విడుదలపై క్లారిటీ వచ్చింది. ఇప్పటికే రెండు సార్లు వాయిదా పడిన ఈ చిత్రం ఫైనల్‌గా జూన్ 25న విడుదల కానుందని రెండ్రోజులుగా వార్తలు హల్‌చల్ చేస్తున్న సంగతి తెలిసిందే! అయితే దీనిపై దర్శకుడు సాన బుచ్చిబాబు క్లారిటీ ఇచ్చారు. ధనుష్ హీరోగా నటించిన 'కర' చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ఆయన అతిథిగా హాజరయ్యారు. అక్కడ 'పెద్ది రిలీజ్ ఎప్పుడు అని అభిమానులు గోల చేయగా బుచ్చి విడుదల తేదిని ప్రకటించారు. ఎట్టి పరిస్థితుల్లో జూన్ 25 సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుందని తెలిపారు. దీంతో అభిమానులు కాస్త ఊరట చెందారు. ఉత్తరాంధ్ర ప్రాంతంలో క్రీడా నేపథ్యంలో సాగే చిత్రమిది. ఇందులో చరణ్ సరసన జాన్వీకపూర్ నటిస్తున్నారు. ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి విడుదలైన రెండు పాటలు దుమ్ము లేపేశాయి. త్వరలో ఓ డ్యూయెట్ రానుంది. ఆ తర్వాత శ్రుతీహాసన్, రామ్‌చరణ్‌పై చిత్రీకరిస్తున్న ప్రత్యేక గీతాన్ని విడుదల చేయడానికి ప్రయత్నం చేస్తున్నారు. షూటింగ్ ఆలస్య, పోస్ట్ ప్రొడక్షన్ పనులు సమయం సరిపోకపోవడం వల్ల విడుదల వాయిదా పడిన సంగతి తెలిసిందే.



### అబ్బా అనిపిస్తున్న నభా.. హాట్ ట్రీట్ ఇచ్చేసిందిగా!

## చీన్ టపాక్ డుం డుం ..సినిమా టైటిల్

### గవిరెడ్డి శ్రీనివాస్ హీరోగా కొత్త చిత్రం




చీన్ టపాక్ డుం డుం' అనే వినూత్నమైన టైటిల్‌తో ఓ కొత్త తెలుగు సినిమా ప్రారంభమైంది. 'శుభం' సినిమా, 'కుమారి శ్రీమతి' వంటి వెబ్ సిరీస్‌ల ద్వారా గుర్తింపు తెచ్చుకున్న గవిరెడ్డి శ్రీనివాస్ ఈ చిత్రంలో హీరోగా నటిస్తున్నారు. పూర్తి స్థాయి కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ సినిమా ప్రేక్షకులకు వినోదాన్ని పంచేలా ఉండనుందని చిత్ర బృందం చెబుతోంది. ఈ సినిమా ప్రారంభ కార్యక్రమం ఘనంగా జరిగింది. పలువురు సినీ ప్రముఖులు హాజరై యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ముహూర్తపు షాట్‌కు నటి సమంత క్లాప్ కొట్టగా, దర్శకుడు గోపిచంద్ మలినేని తొలి షాట్‌ను డైరెక్ట్ చేశారు. మల్లిడి వశిష్ట కెమెరా ఆన్ చేయగా, నందిని రెడ్డి, బీవీఎస్ రవి, గౌతమి కలిసి స్క్రిప్ట్‌ను అందించి చిత్రాన్ని ప్రారంభించారు. ఈ చిత్రాన్ని శ్రీను నాగులపల్లి 'విలేజ్ టాకీస్' బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. ఇది ఆయనకు నిర్మాతగా తొలి సినిమా కావడం విశేషం. సినిమాకు వై.ఎన్ లోహిత్ దర్శకత్వం వహిస్తున్నారు. హీరోయిన్‌గా బ్రిగిడా సాగా నటిస్తుండగా, దువ్వాడ మాధురి ప్రత్యేక పాత్రలో కనిపించనున్నారు. టెక్నికల్ టీమ్ విషయానికి వస్తే, ఆర్ట్ డైరెక్టర్‌గా ఏ.ఎస్. ప్రకాష్ పనిచేస్తున్నారు. సినిమాటోగ్రఫీ బాధ్యతలను సెంథిల్ కుమార్ నిర్వహిస్తున్నారు. సంగీతాన్ని పీఆర్ మ్యూజిక్ అందిస్తుండగా, పాటలను తిరుపతి జావానా రాస్తున్నారు. కథ, స్క్రీన్‌ప్లేలను దివ్య తేజస్వి, విక్రమ్ కుమార్ కె, నాగ్ ట్రైల్‌బ్లేజర్, ఏకలవ్య కలిసి సిద్ధం చేశారు. ఇప్పటికే నర్సీపట్నం, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో షూటింగ్ వేగంగా కొనసాగుతోంది. ఆగస్టు నెలలో సినిమాను విడుదల చేయాలని చిత్ర బృందం లక్ష్యంగా పెట్టుకుంది. వినోదభరితమైన కథ, నవ్వులు పంచే సన్నివేశాలతో 'చీన్ టపాక్ డుం డుం' ప్రేక్షకులను అలరించనుందని యూనిట్ ఆశాభావం వ్యక్తం చేస్తోంది. కాగా, దువ్వాడ మాధురి ప్రయాణం ఎప్పుడూ చర్చనీయాంశంగానే కొనసాగుతోంది. క్లాసికల్ డ్యాన్సర్‌గా, బిజినెస్ ఉమెన్‌గా గుర్తింపు పొందిన ఆమె, వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌తో ఉన్న సంబంధం కారణంగా విస్తృతంగా వార్తల్లో నిలిచారు.



## లెజెండరీ సింగర్ బయోపిక్‌లో రుక్మిణీ వసంత్ ?


ప్రస్తుతం రుక్మిణీ వసంత్‌కి మహర్దశ నడుస్తున్నది. పానిండియా బ్లాక్‌బస్టర్ 'కాంతార 2'తో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నది ఈ కన్నడ కస్తూరి. ప్రస్తుతం 'ఎన్టీఆర్‌నీల్' చిత్రంలో కథానాయికగా నటిస్తూ బిజీగా ఉన్నది. తాజా సమాచారం ప్రకారం ఈ అందాలభామకు మరో అద్భుతమైన అవకాశం వరించిందని ఇన్‌సైడ్ టాక్. వివరాల్లోకెళ్తే.. మహాగాయని ఎమ్మెస్ సుబ్బులక్ష్మి బయోపిక్ తెరకెక్కించేందుకు దర్శకుడు గౌతమ్ తిన్ననూరి సన్నాహాలు చేసుకుంటున్న విషయం విదితమే.ఇందులో సుబ్బులక్ష్మి పాత్రను సాయిపల్లవి పోషిస్తున్నదని వార్తలు కూడా వచ్చాయి. అయితే.. తాజా సమాచారం ప్రకారం సాయిపల్లవి స్థానాన్ని రుక్మిణీవసంత్ రీప్లేస్ చేసిందట. సూపర్‌స్టార్‌డమ్ ఉన్న సాయిపల్లవి కంటే, ఎలాంటి ఇమేజ్ లేని రుక్మిణీ వసంత్ అయితే.. ఆ పాత్రకు సరైన న్యాయం జరుగుతుందని దర్శకుడు గౌతమ్ తిన్ననూరి భావించారట. అందుకే.. ఆ పాత్ర కోసం ఇటీవలే రుక్మిణీ వసంత్‌ని ఆయన కలిసినట్టు తెలిసింది. ఈ ప్రాజెక్ట్‌పై అధికారికంగా క్లారిటీ ఇంకా రావాల్సివుంది.

## ధనుష్‌తో మరోమారు వెంకీ అట్లూరి జత




తమిళ నటుడు ధనుష్‌తో 'సార్' సినిమా తీసి విజయం అందుకున్నారు తెలుగు దర్శకుడు వెంకీ అట్లూరి. అప్పటి నుంచి వీరిద్దరి మధ్య బంధం బలపడింది. ధనుష్ నటించిన ఏ సినిమా తెలుగులో విడుదలైనా వెంకీ అట్లూరి ప్రమోషన్స్‌లో భాగమవుతున్నారు. 'సార్' కాంబినేషన్‌లో మరో సినిమా వస్తుందని చాలాకాలంగా టాక్ నడుస్తోంది. ఈ రూమర్స్ నిజమేనని స్పష్టమైంది. హైదరాబాద్‌లో జరిగిన 'కర' ప్రీరిలీజ్ ఈవెంట్‌కు వెంకీ అట్లూరి గెస్ట్‌గా హాజరయ్యారు. ఈ సందర్భంగా ధనుష్ వెంకీని ఉద్దేశించి మాట్లాడుతూ 'చివరి నిమిషంలో పిలిచినా వచ్చినందుకు థ్యాంక్స్. మీరు నాకు బ్రదర్‌లాంటివారు. 'సార్' లాంటి మంచి చిత్రాన్ని నాకు ఇచ్చారు. 'సార్' తర్వాత మీరో కథ నెరేట్ చేసి.. అదృశ్యమయ్యారు. ఆ కథను సంపూర్ణంగా తీసుకురండి. సినిమా చేయడానికి నేను రెడీగా ఉన్నా. మీ సక్సెస్‌కు చాలా ఆనందిస్తున్నా. మీ గత చిత్రం 'లక్కీ భాస్కర్' చాలా నచ్చింది. మీ రాబోయే సినిమా 'విశ్వనాథ్ అండ్ సన్స్' కు కూడా శుభాకాంక్షలు' అని అన్నారు. ధనుష్ నటించిన 'కర' సినిమా ఈ నెల 30న విడుదల కానుంది.

## అది స్త్రీకి దేవుడు ఇచ్చిన హక్కు



'పిల్లల్ని కనడానికి పెళ్లే అవసరం లేదు. ఒక ప్రాణానికి జన్మనివ్వాలనే కోరికను సామాజిక హోదాతో ముడిపెట్టాల్సిన అవసరం లేదు' అంటూ బోల్డ్ స్టేట్‌మెంట్ ఇచ్చేసింది సహజనటి నిత్యామీనన్. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పెళ్లి గురించి ఆమె మాట్లాడిన మాటలు ప్రస్తుతం చర్చనీయాంశమయ్యాయి.'నేను పెళ్లికి వ్యతిరేకం కాదు. కానీ కొందరు పెళ్లి లేనిదే జీవితమే వ్యర్థం అన్నట్టు మాట్లాడుతుంటారు. వారికి నేను వ్యతిరేకం. మరో జీవికి జన్మనివ్వడం అనేది జన్మతహః స్త్రీకి భగవంతుడిచ్చిన హక్కు. దానికి పెళ్లితో ప్రమేయం లేదు. తల్లి కావాలనుకోవడం పూర్తిగా వ్యక్తిగత నిర్ణయం' అని పేర్కొన్నది నిత్యామీనన్.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com